


SHIVA SURYA TELUGU DAILY
# శివసూర్య
తెలుగు దిన పత్రిక
RNI APTEL : 2023/88704




కర్నూలు సంపుటి : 03, సంచిక : 357 ఛీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూగురువారం -03-సెప్టెంబర్- 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,

## బటన్ నొక్కడానికి రాలేదు
# పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి
- రెండేళ్లలో పింఛన్లకే రూ.73,500 కోట్లు, సంక్షేమానికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు
- ఆడబిడ్డలకు త్వరలో ఏపీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం
- పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి



అమరావతి : నేను కేవలం పింఛన్లు ఇవ్వడానికి, బటన్ నొక్కడానికి ఇక్కడికి రాలేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేదలకు భరోసా కల్పించి, వారిలో ధైర్యం నింపేందుకే వచ్చానని ఉద్ఘాటించారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సరిగ్గా 31 ఏళ్ల కిందట ఇదే రోజున తాను మొదటిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టానని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మిగతా..2లో

### ప్రపంచం తడబడుతున్నా..
## భారత్ దూసుకెళ్తోంది


2

- తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ 7.8% వృద్ధి
- వృద్ధి దేశ ఆర్థిక బలానికి నిదర్శనమన్న పవన్
- ప్రపంచ అనిశ్చితిపై భారత్ స్థైర్యం చాటిందని వెల్లడి
- మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన పవన్ కల్యాణ్
- డిజిటల్ రంగం, మౌలిక వసతుల్లో పురోగతి ఉందని వ్యాఖ్య

అమరావతి : భారత్ జీడీపీ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ ఆర్థిక స్థైర్యం, విశ్వాసానికి నిదర్శనమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కొనసాగుతున్నా భారత్

### వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా
## స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి



- నిబంధనలు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామన్న నారాయణ
- ఓటమి భయంతోనే వైసీపీ నేతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఎద్దేవా
- అభ్యర్థులు కూడా లేని దయనీయ పరిస్థితుల్లో వైసీపీ ఉందని వ్యాఖ్య

అమరావతి : వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టుల్లో కేసులు వేసినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిబం ధనలు, న్యాయస్థానం ఆదే శాలకు అను గుణంగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయాలు తీసుకు ంటామని మిగతా..2లో

## సామాజిక భద్రతలో ఆంధ్రా నం.1.. పెన్షన్లకు రూ.73,594 కోట్ల ఖర్చు



సామాజిక భద్రత అంశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా నిలుస్తోందని మాజీ మంత్రి దేవినేని ఉమా సంతోషం వ్యక్తం చేశారు.

అభివృద్ధి, సంక్షేమం, జల భద్రత వంటి అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తోందని ప్రశంసించారు.

అమరావతి, సెప్టెంబరు 01: సామాజిక భద్రత అంశంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా మహేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం 21 రకాల పింఛన్లకు రూ.73,594 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని పేర్కొన్నారు. కృష్ణా జిల్లాలోని గొల్లపూడిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కూటమి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. అభివృద్ధి, సంక్షేమం, జల భద్రత.. మిగతా..2లో

## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట



శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్

సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్

విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

ఢిల్లి : హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. మిగతా..2లో

## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా
# తీర్చిదిద్దడమే లక్ష్యం

- హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 1 : హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్(ట) వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను మిగతా..2లో

### అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన
### ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ


2

- రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత
- సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ
- ఇప్పటికే మల్లు రవికి వివరణ ఇచ్చిన కొండా సురేఖ

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా

### ప్రజలే స్వచ్ఛందంగా
## ఉత్సవాలు జరుపుకోవాలి



- సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
- మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 1: సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితితో సమావేశం జరిగిందని.. మిగతా..2లో

### ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు భారీ ఊరట..
### ఏకాంత నిర్బంధాన్ని నిలిపివేయాలని
## పాకిస్థాన్ హైకోర్టు ఆదేశం


2

- జైలు నిబంధనల ప్రకారం సాధారణ సదుపాయాలు కల్పించాలని ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశం
- వీరిని కుటుంబ సభ్యులు కలిసేందుకు అమతించాలన్న హైకోర్టు
- కుమారులతో ఫోన్లో ఇమ్రాన్ మాట్లాడేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశం

ఢిల్లి : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు ఇస్లామాబాద్ హైకోర్టు

### ఎకానమీపై మోదీ చేస్తున్న ప్రచారం
## 'లెట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉంది'

- భారత ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే
- దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరిందని ఆరోపణ
- 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని విమర్శలు



ఢిల్లి : ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ అంచనాలకు మించి 7.8శాతం వృద్ధి నమోదు చేయడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేయడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. జీడీపీ వృద్ధిని ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోను షేర్ చేయడంపై దుయ్యబట్టారు. మోదీ ఆర్థిక వ్యవస్థపై చేస్తున్న ప్రచారం కేవలం 'లైట్స్, కెమెరా, ఇన్‌యాక్షన్' అన్నట్లుగా ఉందని విమర్శించారు. సామాన్య ప్రజలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం 50 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరిందని, 40 శాతం యువ పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారని అన్నారు. ఈ మేరకు ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

### బయటపడిన పాక్ వక్రబుద్ధి.. మోదీ ఫొటోను
## క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు..

- పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని బయటపెట్టుకుంది.
- షాంఘై సహకార సంస్థ సదస్సు వేదికగా సభ్య దేశాల అధినేతలు దిగిన ఫొటోను పాక్ క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వివాదం చెలరేగింది.



న్యూఢిల్లీ: అంతర్జాతీయ సదస్సు వేదికగా పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని బయటపెట్టుకుంది. షాంఘై సహకార సంస్థ (షాజూ) సదస్సు సందర్భంగా సభ్య దేశాల అధినేతలు దిగిన ఫొటోను పాక్ క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వివాదం చెలరేగింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ కనిపించకుండా కట్ చేసిన ఫొటోను పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం పోస్టు చేయడం కలకలం రేపింది. అలాగే ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను హైలైట్ చేస్తూ ఫొటో మధ్యలో కనిపించేలా మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ప్రపంచం తడబడుతున్నా.. భారత్ దూసుకెళ్తోంది: పవన్ కల్యాణ్

తన బలాన్ని చాటుకుందని పేర్కొన్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. జీడీపీ వృద్ధి కేవలం ఒక సంఖ్య కాదని, దేశ ప్రజల సమష్టి శక్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశం ముందుకు సాగుతోందన్నారు. 2014 నుంచి భారత్ ఆర్థికంగా మరింత బలపడిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, డిజిటల్ రంగం, మౌలిక వసతుల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. యువత పెద్ద కలలు కనడంతో పాటు ఆవిష్కరణలు, వ్యాపారాలు, సాంకేతిక రంగంలో ముందుకు సాగేందుకు అవకాశాలు పెరిగాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా భారత్ అభివృద్ధి పథంలో కొనసాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ వేదికపై దేశానికి విశ్వసనీయత, ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. బలమైన, స్వయం సమృద్ధి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దేశంగా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు.

## వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి

ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఇప్పటికే రూ. 3,300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చూసి తట్టుకోలేక ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేని దయనీయ స్థితిలో ఆ పార్టీ ఉందన్న ఆయన... అందుకే రాష్ట్రంలో ఎక్కడా ఎన్నికలు ఏకగ్రీవం కాకూడదని జగన్ తన నేతలకు హుకుం జారీ చేశారని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, వెలిగొండ ప్రాజెక్టుల క్రెడిట్ తమదేనని వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను, నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్తోందని వివరించారు. నెల్లూరు నగరంలో కాలువల కట్టలపై ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసే అంశంపై త్వరలోనే ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు. అమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలి

ఉత్సవాల ప్రశాంతంగా జరగడంపై చర్చించినట్లు చెప్పారు. సామూహిక ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ, శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించామన్నారు. భక్తులకు మొక్కల పంపిణీ చేయాలని, చేనేత కండువాలు వాడాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితిని కోరామన్నారు. మట్టి వినాయకులను వాడి... పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు. బోనాల ఉత్సవాల సమయంలో మంచి వర్షాలు కురవాలని అన్ని ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాల్లో ఎల్‌నినో కష్టాల నుంచి గట్టెక్కించి.. మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు. కోర్టులను గౌరవిస్తూనే ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి పయనమైన కొండా సురేఖ

తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## బయటపడిన పాక్ వక్రబుద్ధి.. మోదీ ఫొటోను క్రాప్ చేసి సోషల్ మీడియాలో పోస్టు..




ఎడిట్ చేయడంపైనా విమర్శలు వెల్లువెత్తాయి. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో మంగళవారం జరిగిన ఎస్‌సీవో సదస్సులో 10 సభ్య దేశాల నేతలు కలిసి ఫొటో దిగారు. అయితే పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం విడుదల చేసిన చిత్రంలో మోదీతో పాటు ఇరాన్ అధ్యక్షుడు, మరికొందరు నేతలు కనిపించలేదు. ఫొటోను అలా కట్ చేయడం ద్వారా షెహబాజ్ షరీఫ్‌ను గ్రూప్‌లో మధ్యలో ఉన్నట్టుగా చూపించే ప్రయత్నం చేసినట్లు స్పష్టమైంది. వాస్తవానికి పూర్తి ఫొటోలో షెహబాజ్ షరీఫ్ కుడివైపు నుంచి నాలుగో స్థానంలో ఉన్నారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసిన అసలు ఫొటో స్పష్టం చేసింది. అందులో ఎస్‌సీవో నేతలందరితో పాటు షెహబాజ్ షరీఫ్ కూడా స్పష్టంగా కనిపించారు. దీంతో పాకిస్థాన్ చేసిన ఎడిటింగ్ సోషల్ మీడియాలో బయటపడింది. మరోవైపు, షెహబాజ్ షరీఫ్ అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేసిన ఎస్‌సీవో నేతల రౌండ్‌టేబుల్ వీడియోలోనూ మోదీ కనిపించకుండా క్రాప్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు పాకిస్థాన్ చర్యలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. పూర్తి గ్రూప్ ఫొటోలను షేర్ చేస్తూ పాకిస్థాన్ తీరును ఎండగట్టారు. కొందరు నెటిజన్లు షెహబాజ్ షరీఫ్ చేతిలో బిక్షాటన పాత్ర ఉన్నట్లుగా ఫొటోలను ఎడిట్ చేసి మరీ పోస్టు చేశారు. గతంలో తాను ఆర్థిక సాయం కోసం ప్రపంచ దేశాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పాక్ ప్రధాని చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ ఈ పోస్టులు చేశారు. అలాగే, పాకిస్థాన్ పీఎంవో ఫొటోను ఇలా కట్ చేయడాన్ని 'చిన్నపిల్లల సోషల్ మీడియా ట్రిక్' అంటూ పలువురు విమర్శించారు.

## సామాజిక భద్రతలో ఆంధ్రా నం.1.. పెన్షన్లకు రూ.73,594 కోట్ల ఖర్చు

మొదటి పేజి తరువాయి

ఈ మూడు అంశాలకూ సీఎం చంద్రబాబు నాయుడు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. పట్టిసీమ, పురుషోత్తమపట్నం, వెలిగొండ ప్రాజెక్టులతో రాష్ట్రానికి జల భద్రతనిచ్చామని దేవినేని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నా సమగ్ర నిర్వహణతో అన్ని ప్రాంతాలకూ నీటిని అందిస్తున్నామని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టితోనే రాష్ట్రంలో నీటి వనరుల సమగ్ర నిర్వహణ సాధ్యమవుతోందని వివరించారు. ఏలేరు రిజర్వాయర్‌కు పునరుజ్జీవం పోసి.. పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖకు తాగునీరు పిఠాపురం, పాయకరావుపేట ప్రాంతాలకు గోదావరి జలాలు అందిస్తామని భరోసా కల్పించారు. రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమాన్నీ కూటమి ప్రభుత్వం సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని టీడీపీ సీనియర్ నేత అన్నారు. 8 మంది పిల్లలు ఉన్న కుటుంబానికి కూడా 'తల్లికి వందనం' పథకం అమలు చేస్తోందన్నారు. ఇదే సమయంలో వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో 10 లక్షల మంది అర్హుల పింఛన్లను తొలగించారని ఆరోపించారు. పెన్షన్ సొమ్మును రూ.1,000 పెంచేందుకు ఐదేళ్లు కాలయాపన చేశారని, దీంతో ఒక్కో లబ్ధిదారుడికి రూ.28 వేల నష్టం వాటిల్లిందని విమర్శించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి అభివృద్ధిని అడ్డుకున్న వైసీపీ ఇప్పుడు క్రెడిట్ చోరీ డ్రామాలాడుతోందని ఫైరయ్యారు. ఒక్కో ప్రాంతంలో ఒక మాట మాట్లాడుతూ ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే కుట్రలకు తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలకు సూచించారు.

## బటన్ నొక్కడానికి రాలేదు - పేదలకు భరోసా ఇవ్వడానికే వచ్చా

మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంపై కీలక ప్రసంగం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పింఛన్లు అందిస్తున్నామని సీఎం తెలిపారు. గడచిన రెండేళ్లలో పెన్షన్ల కోసమే రూ.73,500 కోట్లు వెచ్చించామని వివరించారు. అలాగే, మొత్తం సంక్షేమం కోసం రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా వారికి ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదల పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందన్నారు. సంక్షేమం అనేది పేదవాడిని నిలబెట్టేలా ఉండాలని సూచించారు.మహిళా సాధికారత : ఆడబిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా ఇబ్బంది పడకూడదని ఉచిత బస్సు ప్రయాణం తీసుకువచ్చామని సీఎం చెప్పారు. రాబోయే రోజుల్లో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. మహిళలకు కష్టం రాకూడదనే ఉద్దేశంతో 'దీపం' పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని 33 శాతం రిజర్వేషన్లు తెచ్చామన్నారు. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తానే తీసుకువచ్చానని, త్వరలో మహిళా డ్రైవర్లను కూడా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు. నరసాపురంలో దేశంలోనే నంబర్ వన్ ఆక్వా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. నిన్ననే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించానని, దానికి రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తున్నామని, కొండలు, గుట్టలు తొలిచి మరీ నీటిని తరలిస్తామన్నారు. నదుల అనుసంధానంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఏమాత్రం రావని భరోసా ఇచ్చారు. తలసరి ఆదాయం పెంపు : ప్రస్తుతం మన తలసరి ఆదాయం రూ.3 లక్షలుగా ఉందని, 2047 నాటికి దానిని రూ.54 లక్షలకు చేర్చడమే లక్ష్యమని సీఎం వివరించారు. తలసరి ఆదాయం పెరిగితే ఆటోమేటిక్ గా పేదల సంపద వృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గుర్తు చేశారు. భవిష్యత్తు అంతా పర్యాటక రంగానిదేనని, ఆ రంగాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గత పాలకులు కేవలం బటన్లు నొక్కి రోడ్లకు గుంతలు పెట్టారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్సీపీ పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, కానీ కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. తాము ఏ మంచి పని చేసినా వైఎస్సార్సీపీ అడ్డుపడుతోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ లో భాగంగా మెగా డీఎస్సీ వేస్తుంటే దాన్ని అడ్డుకునేందుకు కోర్టులో ఏకంగా 350 కేసులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాండ్



టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, మీ పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫొటో అవసరం లేదని తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తపన, అనుభవంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో దూసుకెళ్తోందని సీఎం అన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేనని, ఎంత సేవ చేసినా రుణం తీర్చుకోలేనని భావోద్వేగానికి గురయ్యారు. 45 ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు టీడీపీకి అండగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గౌడ కులస్తులకు మద్యం షాపులు కేటాయిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి మరింత వేగంగా జరగాలంటే ప్రజలు తమ సలహాలు, సూచనలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు.

## ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు భారీ ఊరట.. ఏకాంత నిర్బంధాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్ హైకోర్టు ఆదేశం

మొదటి పేజి తరువాయి

నుంచి పెద్ద ఎత్తున ఊరట లభించింది. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఖైదులో ఉన్న వీరిని ఏకాంత నిర్బంధంలో ఉంచరాదని జైలు అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ ఖాదిమ్ హుస్సేన్ సోమ్రో నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలను ఏకాంత నిర్బంధంలో ఉంచుతున్నారంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది.



### కోర్టు తీర్పులోని ప్రధానాంశాలు:

ఏకాంత నిర్బంధానికి స్వస్తి: ఇమ్రాన్ ఖాన్ దంపతులను ఒంటరిగా ఉంచే పద్ధతికి స్వస్తి పలికి, జైలు నిబంధనల ప్రకారం సాధారణ సదుపాయాలు కల్పించాలి. ఇమ్రాన్, బుష్రా సమావేశం అయ్యేందుకు అవకాశం కల్పించాలి. సకాలంలో కుటుంబసభ్యుల భేటీలు: జైలు నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలి. ఆయన కుమారులతో ఫోన్లో మాట్లాడేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి. పుస్తకాలు, పత్రికలు, వైద్యం: ప్రతిరోజూ క్రమం తప్పకుండా వార్తాపత్రికలు, పుస్తకాలు అందజేయడంతో పాటు, జైలు నిబంధనలకు అనుగుణంగా సరైన వైద్య సదుపాయాలు కల్పించాలి. ఈ ఆదేశాల అమలుపై పూర్తి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని అడియాలా జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. అవినీతి కేసుల్లో సుదీర్ఘ కాలంగా శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు జైల్లో సరైన వసతులు కల్పించడం లేదంటూ ఆయన కుటుంబ సభ్యులు కొద్దికాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో... హైకోర్టు నుంచి ఈ సానుకూల తీర్పు వెలువడటం గమనార్హం.

## తెల్ల బంగారానికి గండాలెన్నో..

తెలంగాణలో వరి తర్వాత అత్యంత ప్రాధాన్యం ఉన్న వాణిజ్య పంటల్లో పత్తి ఒకటి. తెల్ల బంగారంగా పేరొందిన పత్తి, నేడు రైతులకు నష్టాల మూలంగా ఆత్మహత్యల చరిత్రగా మారుతోంది. విత్తనం కొనుగోలు దగ్గర మొదలయ్యే కష్టం.. మొలక దశలో వర్షాభావం.. ఎదుగుదలలో చీడపీడలు.. పంట చేతికొచ్చే సమ యంలో అకాల వర్షాలు.. చివరికి మార్కెట్‌లో ధర, కొనుగోలు నిబంధనల రూపంలో మరో గండం.. ఇలా పత్తి రైతును సమస్యలు వరుసగా వెంటాడుతున్నాయి.

### తగ్గుతున్న ఉత్పాదకత..

పత్తి సాగు విస్తీర్ణం పెరిగినా, దిగుబడి అదే స్థాయిలో పెరగక పోవడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో 2025-26 సీజన్‌లో సెప్టెంబర్ 24 నాటికి పత్తి సాగు విస్తీర్ణం సుమారు 45.95 లక్షల ఎకరాలుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నివేదిక పేర్కొంది. ఎకరాకు వచ్చే దిగుబడి, నాణ్యత, సాగు వ్యయం, మార్కెట్ ధర- ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత లేకపోవడమే రైతు నష్టాలకు ప్రధాన కారణం.

### విత్తనం దగ్గరే మొదలయ్యే గండం!

పత్తి సాగులో రైతుకు మొదటి భరోసా నాణ్యమైన విత్తనం. కానీ నకిలీ, నాసిరకం విత్తనాల వల్ల మొలక శాతం తగ్గితే రైతు మొదటి పెట్టుబడే వృథా అవుతుంది. ఒకసారి విత్తనం విఫలమైతే మళ్లీ విత్తడం అంటే అదనపు ఖర్చు, అదనపు శ్రమ. విత్తనాల నాణ్యతపై కఠిన తనిఖీలు, నకిలీ విత్తనాల సరఫరాపై ఉక్కుపాదం అవసరం. మందులు



కొనుగోలు చేసినా అవి నాణ్యమైనవి కాకపోతే పంట నష్టమే కాకుండా రైతు పెట్టుబడీ నష్టమవుతుంది. అందుకే విత్తనం నుంచి పురుగుమందు వరకు ప్రతి దశలో నాణ్యత నియంత్రణను కట్టుదిట్టం చేయాలి.

వాతావరణం మరో సవాల్..

వాతావరణ మార్పులు పత్తి రైతుకు కొత్త పరీక్షలు పెడుతున్నాయి. విత్తే సమయంలో వర్షం లేకపోవడం, ఆ తర్వాత ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడం, పూత-కాయ దశలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం పంట దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. అందువల్ల ప్రాంతానికనుగుణంగా వాతావ రణాన్ని తట్టుకునే, అధిక దిగుబడినిచ్చే, చీడపీడలను తట్టుకునే కొత్త రకాలపై పరిశోధనను వేగవంతం చేయాలి.

కొనుగోలు నిబంధనలు.. మరో గండం!

పంట పండించిన తర్వాత దాన్ని అమ్ముకోవడమే మరో పెద్ద సమస్య. 2025-26 సీజన్‌లో తెలంగాణలో సీసీఐ ఎకరాకు ఏడు క్వింటాళ్ల కొనుగోలు పరిమితి విధించడం రైతుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. గతంలో ఉన్న పరిమితితో పోలిస్తే ఇది తగ్గడంతో, అదనపు పత్తిని ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. అదే సమయంలో తేమ శాతం నిబంధనలు కూడా రైతులకు ఇబ్బం దిగా మారాయి. వర్షాల కారణంగా పత్తిలో తేమ పెరిగినప్పుడు నా ణ్యత ప్రమాణాల పేరుతో కొనుగోలు నిరాకరించకుండా, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతుకు న్యాయం చేయాలి.

పత్తి రైతుకు భరోసా ఎప్పుడు?

అన్నదాత పండించిన పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లిన తర్వాత 'ఇంతే కొంటాం' అని పరిమితులు పెట్టడం కాదు.. పండిన ప్రతి గింజకు న్యాయమైన ధర కల్పించడమే ప్రభుత్వాల బాధ్యత. రైతు నష్టపోతే కేవలం ఒక కుటుంబం కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థ, వస్త్ర పరిశ్రమ, గ్రామీణ జీవనాధారం కూడా ప్రభావితమవుతాయి. 'విత్తనాల సంచి మంచిదైతే పంట చేతినిండా వస్తుంది' అన్న పెద్దల మాటను ప్రభుత్వాలు ఆచరణలో నిజం చేయాలి.

## కదిలే బస్సులో అత్యాచారం- కేంద్రం, యూపీ సర్కార్‌లపై రాహుల్ ధ్వజం

**మైనర్ పై సామూహిక అత్యాచారం జరగడం దారుణమని వ్యాఖ్య- ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్న రాహుల్**

ఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని అత్యాచార ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం, ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వంపై మంగళవారం తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ఘనటపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని పోలీసులకు జవాబుదారితనం ఏమాత్రం లేదని వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన నేరాల వలే దీన్ని కూడా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేటర్ నోయిడా నుంచి ఢిల్లీకి వెళ్తున్న స్లీపర్ బస్సులో, ఒక మైనర్ పై 47 కిలోమీటర్ల మేర సామూహిక అత్యాచారం జరగడం దారుణమన్నారు. ఈ విషయంపై ఢిల్లీ పోలీసులు గానీ, నోయిడా పోలీసులు గానీ కనీస సమాచారం కూడా తెలుసుకోలేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్‌లో తీవ్రంగా విరుచుకుపడ్డారు. "బస్సు నోయిడా, గ్రేటర్ నోయిడా ఎక్స్‌ప్రెస్‌వే, ఢిల్లీ రింగ్ రోడ్ ఇలా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాన్ని దాటి ప్రయాణించింది. అయితే, ఏ ఒక్క చెక్ పోస్టు వద్ద కూడా ఆగలేదు. బస్సులో తెరలు కప్పి ఉండటంతో లోపల ఏం జరుగుతుందో ఎవరూ చూడలేకపోయారు. పైగా, నేరస్థులకు యంత్రాంగం పట్ల ఎలాంటి భయం లేదు. 'నిర్భయ' కేసు జరిగి ఇన్ని ఏళ్లు గడిచినా, అలాంటి ఘటనలు పునరావృతమవుతున్నా, బస్సులను తనిఖీ చేయడం, పర్యవేక్షించడం వంటివి ఎందుకు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యవస్థను సరిదిద్దేలోపు ఇంకా ఎంతమంది మహిళలు, బాలికలు ఇలాంటి పరిస్థితులను అనుభవించాల్సి ఉంటుంది."



రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

పోలీసుల కథనం ప్రకారం, ఆగస్టు 4 రాత్రి కుటుంబ సభ్యులతో జరిగిన మనస్పర్థల కారణంగా ఓ యువతి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అనంతరం ఆ యువతి, నోయిడాలో ఉంటున్న తన బంధువులను కలిసేందుకు బయలుదేరింది. రాత్రి సమయంలో భారీ వర్షం కురుస్తుండగా, మార్గం తెలియక ఆమె పొరపాటున పరీ చౌక్ వద్ద బస్సు దిగింది. వర్షంలో ఒంటరిగా నిలుచున్న ఆమె అటుగా వస్తున్న ఒక ఖాళీ స్లీపర్ బస్సును ఆపి సహాయం కోరింది. బస్సు డ్రైవర్, కండక్టర్ ఆ బస్సు నోయిడా సెక్టార్ 63 వైపు వెళుతుందని నమ్మించి, ఆమెను బస్సు లోపలికి ఎక్కించుకున్నారు. బస్సు కదలడం ప్రారంభించిన కొద్దిసేపటికే కండక్టర్ సందీప్ మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. తర్వాత డ్రైవర్, కండక్టర్ ఇద్దరూ కలిసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రతిఘటించిన ఆమెను చంపేస్తామని తీవ్రంగా బెదిరించారు. ఆ స్లీపర్ బస్సులోని బెర్తులకు కర్టెన్లు ఉండటం వల్ల లోపల జరుగుతున్న దారుణం బయటకు కనిపించలేదని పోలీసులు తెలిపారు. సుమారు 47 కిలోమీటర్ల మేర ప్రయాణించిన తర్వాత, ఢిల్లీలోని కాశ్మీరీ గేట్ బస్ టెర్మినల్ సమీపంలోని రింగ్ రోడ్ వద్ద అర్ధరాత్రి సమయంలో బాధితురాలిని బస్సు నుంచి దించేసి నిందితులు పరారయ్యారు. దర్యాప్తు అధికారుల ప్రకారం, సాంకేతిక లోపం తలెత్తడంతో మరమ్మతుల కోసం బస్సును గ్రేటర్ నోయిడాలోని సూరజ్‌పూర్‌లో ఉన్న వర్క్‌షాప్‌కు తీసుకెళ్లారు. మరమ్మతుల అనంతరం ఇద్దరు నిందితులు సాయంత్రం 5 గంటల సమయంలో వర్క్‌షాప్ నుంచి బస్సును తీసుకుని బయలుదేరారు. సూరజ్‌పూర్ నుంచి పారి చౌక్‌కు వెళ్లారు. అక్కడ లిఫ్ట్ ఇస్తామనే నెపంతో యువతిని బస్సు ఎక్కించుకుని కాశ్మీరీ గేట్ వైపు బయలుదేరారు. మార్గమధ్యలో వారు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు! ప్రజాసేవే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ పయనం!

జనసైనికుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రక్తదాన శిబిరం





నందవరం,శివసూర్య, సెప్టెంబర్ 2:జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 55వ జన్మదిన వేడుకలను నందవరం మండలంలో జనసైనికులు ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు రేఖగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జనసేన నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నందవరం మండల జనసేన అధ్యక్షుడు పెద్ద ఎల్లప్ప ఆధ్వర్యంలో జనసైనికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లప్ప మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై స్పందిస్తూ పరిపాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని అన్నారు.కూటమి ప్రభుత్వంలో రాజకీయాలను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారని కొనియాడారు.ఆయన ఆలోచనా విధానం,సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా నందవరం మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం రేఖగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసైనికులు స్వీట్లు పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని,రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు,జనసైనికులు చంద్ర,అంజి,బంగారి, ఇర్ఫాన్,తిమ్మప్ప,విజయ్,ఆదిల్,ప్రణీత్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి శిక్షణ తరగతులు



నంద్యాల,శివసూర్య, సెప్టెంబర్ 2:సెప్టెంబర్ 5వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుండి నిర్వహించడం జరుగుతుంది, ఈ కార్యక్రమాన్ని నంద్యాల టౌన్ టెక్కే నందు గల భరతమాత గుడి దగ్గర ఉన్న విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యాలయంలో నిర్వహించడం జరుగును. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి నంద్యాల జిల్లా సభ్యులందరూ పాల్గొని శిక్షణ తరగతులలో మనకు నిర్దేశించిన ఏడు అంశాలపై పూర్తిగా అవగాహన చేసుకుని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము, అలాగే నంద్యాల జిల్లాలో గల 29 మండలాల నుండి కమిటీలను ఏర్పాటు చేయడానికి పెద్దలు నిర్ణయించినారు, కావున నంద్యాల జిల్లా మత్స్యకార సంక్షేమ సమితిలో బాధ్యతలు కలిగిన ప్రతి ఒక సభ్యుడు హాజరు కావలసిందిగా కోరడమైనది. ఈ కార్యక్రమంలో వేదవాస డివిజన్ 24 జిల్లాల ఇన్చార్జ్ సుంకరి రాజు మరియు నంద్యాల జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షులు పత్తికొండ బాలాజీ , మరియు మత్యకార సంక్షేమ సమితి నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తెలుగు శివప్రసాద్ పాల్గొనడం జరిగింది. ఆహ్వానించువారు నంద్యాల జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి నంద్యాల జిల్లా కమిటీ

## మంత్రాలయంలో ఘనంగా రథోత్సవం - పీఠాధిపతి ఆధ్వర్యంలో వేడుకలు



మంత్రాలయం,శివసూర్య, సెప్టెంబర్ 2:మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామంలోని రాఘవేంద్ర స్వామి మఠం (అను మంత్రాలయం)లో రథోత్సవం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మఠం సాంప్రదాయం ప్రకారం సప్తరాత్రోత్సవాల చివరి రోజు రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని స్వామీజీ తెలిపారు. అంతకుముందు మఠానికి చేరుకున్న స్వామీజీకి అర్చకులు, మేనేజర్లు ఘన స్వాగతం పలికారు. పీఠాధిపతి రథానికి మంగళహారతులు ఇచ్చిన అనంతరం రథోత్సవం ముందుకు కదిలింది. పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ సందేశాన్ని ఇచ్చారు అనంతరం భక్తులకు ఫల మంత్రాక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు.

## నీట్ లో మెరిసిన గ్రామీణ విద్యార్థి



నందవరం,శివసూర్య, సెప్టెంబర్ 2: మండలం పరిధిలోని ముగతి గ్రామానికి చెందిన ఈడిగ అజయ్ కుమార్ నీట్ ఫలితాలలో మెరిశారు.గ్రామానికి చెందిన రైతు పెద్ద ఆంజనేయులు,అంజమ్మ కుమారుడు ఈడిగ అజయ్ కుమార్ నీట్ ఫలితాలలో 499 మార్కులు సంపాదించి శభాష్ అనిపించాడు.90813 అల్ ఇండియా ర్యాంక్ సాధించి స్టేట్ కోటాలో గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అనంతపురం లో సీటు సాధించి భళా అనిపించాడు.గ్రామంలో ఎంబిబిస్ సీటు సాధించడం తో హర్షతిరేకాలు వ్యక్తం చేశారు.విద్యార్థి,తల్లిదండ్రులను గ్రామ ప్రజలు అభినందించారు.

## చెరువులు, రిజర్వాయర్ల లీజును రద్దు చేయండి ఎల్ నినో తో ఆర్థిక ఇబ్బందుల్లో మత్స్యకారులు ప్రభుత్వానికి ఆప్కాఫ్ ఛైర్మెన్ యాటగిరి వినతి



అమరావతి,శివసూర్య, సెప్టెంబర్ 2:ఎల్ నినో కారణంగా నీటి లభ్యత సాధారణ స్థాయి కంటే తగ్గిపోవడంతో మత్స్య ఉత్పత్తి గణనీయంగా పడి పోయిందని... అందువల్ల చెరువులు, రిజర్వాయర్లలో వేట హక్కులు పొందిన మత్స్య సహకార సంఘాల లీజును రద్దు చేయాలని...ఆప్కాఫ్ ఛైర్మెన్ యాటగిరి రాంప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.ఈ మేర బుధవారం జిల్లాల అధ్యక్షులు పోలిశెట్టి, రత్నం, భూ శంకర్, శ్రీ రామ్, పాపారావు మత్స్య శాఖ కమిషనర్ రాంశంకర్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. వాతావరణ మార్పులతో నీటి లభ్యత తగ్గిపోయిందని... దీంతో మత్స్య ఉత్పత్తి సన్నగిల్లిందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో వేట హక్కులు పొందిన మత్స్య సహకార సంఘాలకు లీజు చెల్లించడం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తున్న దని స్పష్టం చేసారు.ప్రభుత్వం స్పందించి లీజును రద్దు చేసి మత్స్య సహకార సంఘాలను ఆదుకోవాలని కోరారు.ఈ విషయాన్ని మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గారు , గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వానికి వివరిస్తామన్నారు.

# కాసులకు కక్కృతి పడి భూముల్లో గోల్మాల్ కుటుంబాల్లో చిచ్చి పెడుతున్న రెవిన్యూ సిబ్బంది..

భూమి రిజిస్ట్రేషన్ కోడుమూరు పరిధి ఎమ్మిగనూరు లో అక్రమ రిజిస్ట్రేషన్..

వారసుల అనుమతి లేకుండా ఒకరి పేరుతొ ఆన్లైన్ చేసిన రెవెన్యూ అధికారి..

తప్పుడు రిజిస్ట్రేషన్‌తో ఏడుగురు అక్కచెల్లెళ్లకు అన్యాయం..




గోనెగండ్ల, శివసూర్య, సెప్టెంబర్ 2: కర్నూలు జిల్లా గోనెగండ్లలో తమ తండ్రి నుంచి రావాల్సిన ఆస్తిని నకిలీ పత్రాలతో 5వ కూతురు పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, గోనెగండ్ల మండలానికి చెందిన ఏడుగురు అక్కచెల్లెళ్లు, 4 అన్న తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మండల, జిల్లా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వివరల్లోకి వెళితే గోనెగండ్ల గ్రామానికి చెందిన కీర్తిశేషులు మాబురెడ్డి భార్య షేక్ హజ్జుబి కు సంతానం నలుగురు కొడుకులు, 8 మంది కూతుళ్లు



కీర్తిశేషులు మాబురెడ్డి కుమారులు కుమార్తెల కోసం 800 సర్వే నెంబర్లో భూమి 3 ఎకరాల 32 సెంట్లు 12 మంది సంతనానికి సమాన హక్కు ఉండేలాల భూమి పూర్తి హక్కు భార్యకు ఇచ్చారు. షేక్ హజ్జుబి పేరు మీద ఉన్న భూమి కన్నేసిన ఐదో కుమార్తె షేక్ నూరాబి భర్త అల్లుడు రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ నజీర్ అత్తకి మాయా మాటలు చెప్పి, అత్త బాగోగులు చూసుకుంటామని, మతిస్థిమితం లేని అత్తకు రెవెన్యూ రిజిస్ట్రేషన్ ఆఫీసు చుట్టూ తిప్పుతూ గోనెగండ్ల ఉన్న భూమిని ఎమ్మిగనూరులో దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇది లేలిసిన అక్కా చెల్లెలు నువ్వు ఎలా రిజిస్ట్రేషన్ చేసుకున్నావు అని అడిగితే మీరు ఎవరు మీ అంత చూస్తా నా ఇంటికొస్తే మిమ్మల్ని ఏం చేయాలో చేసి చూపిస్తా మా చెల్లెలు మా అక్క షేక్ నూర్ బి భర్త రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ నజీర్ నా ఇంటికి ఎవరు మీరు రావడానికి అని నానా దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఏడుగురు అక్క చెల్లెల్లుబాధితుల కథనం ప్రకారం, తమకు హక్కుగా రావాల్సిన భూమిని తప్పుడు ఆధారాలతో ఒక వ్యక్తి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై 1100 ద్వారా ఫిర్యాదు,స్థానిక తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా విచారణ చేపట్టలేదు. దీంతో మానసిక వేదనకు గురవుతున్నామని కంటతడి పెడుతున్న బాధితులు, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులే పట్టించుకోకుండా పెడచెవిన పెడితే సమస్యలను పరిష్కరించేదెవరు,చివరకు సోమవారం కర్నూలు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పి జీ ఆర్ ఎస్ లో జిల్లా కలెక్టర్‌ను కలిసి అర్జీ సమర్పించారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, తమ ఆస్తి హక్కులను పునరుద్ధరించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇంతవరకు అధికారుల నుండి ఎలాంటి సమాచారం రాలేదని వాపోతున్నారు. 12 మంది వారసులకు ఎనిమిది వందల సర్వే నెంబర్లు మూడు ఎకరాల 32 సెంట్లు సమాన హక్కు కల్పించేంతవరకు ఆర్ ఓ అడంగల్ హోల్డ్ లో పెట్టాలని, వారసులకు పరిష్కారం అయ్యేంతవరకు ఈ భూమిని ఎవరు కొనుగోలు చేయకూడదని తెలిపారు.

# పాఠశాలల మౌలిక వసతుల పనుల నమోదులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాఠశాలలను సందర్శించి హెచ్‌ఎంలతో సమన్వయం చేసుకోవాలి

పూర్తయిన పనుల వివరాలను ఫోటోలతో సహా తక్షణమే పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి క్లోజ్ చేయాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




నంద్యాల,శివసూర్య,సెప్టెంబరు 02:ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో జిల్లా పనితీరు మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్‌లో ఉన్న డేటా ఎంట్రీ, స్టేటస్ అప్‌డేట్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి 'మన బడి – మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనుల పురోగతిపై విద్యాశాఖ, సమగ్ర శిక్ష, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంఈఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పాఠశాలల మౌలిక వసతుల కాంపోనెంట్లకు సంబంధించిన డేటా ఎంట్రీలో జిల్లా పనితీరు ఆశించిన స్థాయిలో లేదన్నారు. పాఠశాలల్లో పనులు పూర్తయినప్పటికీ వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తయిన ప్రతి పనికి సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం ఫోటోలతో సహా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఇప్పటికే పూర్తయిన పనులను సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమకు కేటాయించిన 'మన బడి – మన భవిష్యత్తు' లాగిన్ ద్వారా పరిశీలించి, పనులు పూర్తయినట్లు క్లోజ్ ఆప్షన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పని పూర్తయినట్లు ధ్రువీకరించేందుకు నిబంధనల మేరకు మూడు వైపుల నుంచి స్పష్టమైన ఫోటోలను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పూర్తయిన పనులను గుర్తించి, వాటి వివరాలు సరైన విధంగా పోర్టల్‌లో నమోదయ్యేలా చూడటంలో క్షేత్రస్థాయి ఇంజనీరింగ్ సిబ్బంది కీలక బాధ్యత వహించాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను వ్యక్తిగతంగా సందర్శించి, ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.పాఠశాలల్లో పూర్తయిన అన్ని కాంపోనెంట్లకు సంబంధించిన పనుల వివరాలను సమగ్రంగా అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్ల నిర్మాణం, మరమ్మతులు, మేజర్, మైనర్ రిపేర్లు, విద్యుదీకరణ పనులు, తాగునీటి సదుపాయాలు, ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటు, ఫర్నిచర్, డ్యూయల్ డెస్కుల ఏర్పాటు, గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు, పాఠశాలల పెయింటింగ్ పనులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు పూర్తయి ఉంటే వాటి ప్రస్తుత స్థితిని పరిశీలించి, అవసరమైన ఫోటోలను అప్‌లోడ్ చేసి, సంబంధిత లాగిన్‌లలో స్టేటస్ అప్‌డేట్ చేసి క్లోజ్ చేయాలని ాూజుఔ×ఙజ, పంచాయతీరాజ్, =ఔా, =ఒదీ, సమగ్ర శిక్ష (ూూా), గిరిజన సంక్షేమ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనులు పూర్తయినప్పటికీ పోర్టల్‌లో వివరాలు ఎందుకు నమోదు కాలేదో సంబంధిత అధికారులు పరిశీలించి, పెండింగ్ కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఐజూా, వీజూాలు ఇంజనీరింగ్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, మండలాల వారీగా పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. అలాగే, సంబంధిత ాూజు లాగిన్‌లో కూడా అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి, డేటా ఎంట్రీలో ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

# అందరికీ పవన్ కళ్యాణ్ స్ఫూర్తి. రక్తదాన కార్యక్రమంలో జనసైనికులు.



అయిజ (శివసూర్య )పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా అయిజ పట్టణం లో రక్తదాన శిబిరం నిర్వహించిన జనసేన జన నాయకులు అభిమానులు.అభిమానం అంటే కేవలం జై కొట్టడం కాదు,మన అభిమాన నాయకుడి ఆశయాలను ఆచరిస్తూ, ఒక ప్రాణానికి అండగా నిలవడం.మా ఆరాధ్య నాయకుడు శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈరోజు జోగులాంబ గద్వాల జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ బాస్ చిన్న తిమ్మప్ప ఆధ్వర్యంలో,జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణం లో పవన్ కళ్యాణ్ అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. పవన్ కళ్యాణ్ అభిమానులు మాట్లాడుతూ,అన్న పవన్ కళ్యాణ్ కోసం ప్రాణం ఇవ్వలేకపోయినా ఆయన స్ఫూర్తితో ఒక ప్రాణాన్ని కాపాడే రక్తాన్ని ఇవ్వగలిగాము,ఈరోజు ఇచ్చిన ఈ రక్త దానం ఎవరికి ప్రాణం పోస్తుందో తెలియదు,కానీ ఆ ప్రాణంలో మా అభిమాన నాయకుడి స్ఫూర్తి తప్పకుండా ఉంటుంది అని వారు అన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

ఎల్ నినో నేపథ్యంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలి-చిన్న విగ్రహాలను ఏర్పాటు చేయాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు,శివసూర్య,సెప్టెంబర్ 02: రానున్న వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు ఎల్ నినో నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాగు నీటికి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి కోరారు.కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో గణేష్ చతుర్థి ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ



సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఎల్ నినో ప్రభావం ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని అత్యంత పొదుపుగా, ప్రధానంగా తాగునీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. రాబోయే కాలంలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి వనరులను సంరక్షించుకోవడం అత్యవసరమన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమాల కోసం తాగునీటి అవసరాలకు కేటాయించిన నీటిని విడుదల చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. నన్నూరు టోల్ గేట్ దగ్గర ఉన్న హెచ్ ఎన్ ఎన్ ఎస్ కాలువ, తడకనపల్లి, ఉలిందకొండ హెచ్ ఎన్ ఎన్ ఎస్ కాలువ, గార్గేయపురం చెరువులో గణేష్ నిమజ్జనం ప్రత్యామ్నాయ మార్గాలని కలెక్టర్ కమిటీ సభ్యులకు సూచించారు. ఈసారి పెద్ద పరిమాణంలోని వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనానికి సంబంధించి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, సాధ్యమైనంత వరకు చిన్న పరిమాణంలోని విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రకృతి విపత్తులు, నీటి కొరత వంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా సహకరించాలని అన్నారు. చిన్న విగ్రహాల ఏర్పాటు ద్వారా నిమజ్జన ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు నీటి వినియోగాన్ని కూడా తగ్గించవచ్చని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నిమజ్జన ప్రదేశాల వద్ద ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన బారికేడ్లు, లైటింగ్, పారిశుద్ధ్య సదుపాయాలు, అత్యవసర సేవలు, పోలీసు బందోబస్తు వంటి ఏర్పాట్లను సంబంధిత శాఖలు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, నగర మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి మనోహర్, గణేష్ చతుర్థి ఉత్సవ కమిటీ సభ్యులు, ఇరిగేషన్, మున్సిపల్, పోలీసు శాఖలతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బలరామ జయంతి పురస్కరించుకుని గుంటి రంగనాథుడికి ప్రత్యేక పూజలు



అలంపూర్, శివసూర్య, సెప్టెంబర్ 2:జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీ 6వ వార్డు తుపత్రాలలో స్వయంభువుగా వెలసిన శ్రీ గుంటి రంగనాథ స్వామి ఆలయంలో బలరామ జయంతి పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ గుంటి రంగనాథ స్వామివారికి పంచామృత అభిషేకం, రంగనాథ అష్టోత్తర శతనామావళి పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, లోకక్షేమం, గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.ఈ పూజా కార్యక్రమాల్లో తుపత్రాల గ్రామ ప్రజలు, భక్తులు, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న భక్తులు తదితరులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.శ్రీ గుంటి రంగనాథ స్వామివారి అనుగ్రహం సర్వజనులపై ఉండాలని ఆకాంక్షిస్తు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆచార్య చక్రవర్తి చార్యులు తెలియజేయడం జరిగింది.

## సనాతన ధర్మ ప్రచారకులకు ఘన సత్కారం సత్యప్రియ ఆచార్యులను జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య సెప్టెంబర్ 2 :జోగులాంబ గద్వాల జిల్లా పెద్దదిన్నె గ్రామానికి చెందిన సుధా పండితులు సత్యప్రియ ఆచార్యులు సనాతన ధర్మ ప్రచారంలో చేస్తున్న విశేష కృషిని గుర్తిస్తూ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సత్యప్రియ ఆచార్యులను శాలువాతో సత్కరించి, వారి ఆధ్యాత్మిక సేవలను అభినందించారు. సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలు కేవలం ఒక మండలానికే పరిమితం కాకుండా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు విస్తరించేలా ఆధ్యాత్మిక ప్రసంగాలు, ధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని చక్రవర్తి చార్యులు సూచించారు.దీనికి సత్యప్రియ ఆచార్యులు సానుకూలంగా స్పందిస్తూ, అందరి సహాయ సహకారాలతో, ముఖ్యంగా చక్రవర్తి చార్యుల సహకారంతో జిల్లాలోని అన్ని గ్రామాల్లో సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.అనంతరం రామనామ సంకీర్తన నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## లోక కళ్యాణార్థం విష్ణు సహస్ర నామం నిర్వహించిన జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు



గద్వాల, శివసూర్య సెప్టెంబర్ 2 : జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీలోని శ్రీలేఖ కిరాణా ప్రాంగణంలో ఉన్న శ్రీ గురు ఓంకార పీఠం ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం వరుణ యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షులు ఆచార్య చక్రవర్తి చార్యులు పాల్గొని ప్రత్యేక పూజలు, యాగ కార్యక్రమాలను నిర్వహించారు. దేశంలో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖశాంతులతో జీవించాలని సంకల్పించి వరుణ యాగం నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు, గ్రామ ప్రజలకు, సేవకులకు ఆచార్య చక్రవర్తి చార్యులు శుభాభివందనాలు, ధన్యవాదాలు మరియు మంగళాశాసనాలు తెలియజేశారు.

## ఏపీ జేపీసీ పిలుపుతో ఉపాధ్యాయుల నల్లబ్యాడ్జీల నిరసన



మంత్రాలయం,శివసూర్య,సెప్టెంబర్ 2:ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేపీసీ అమరావతి పిలుపు మేరకు మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డి ఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఐ ఆర్ ప్రకటించాలని, పి ఆర్ సి ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఉపాధ్యాయులు కె. వీరేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పుట్టినరోజు అన్నదానం.



అయిజ (శివసూర్య ) పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో జననాయకుడు వీరేష్.అయిజ పట్టణంలో పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా, ప్రభుత్వ దవఖానలో అందరికీ భోజనాలు పంపిణీ చేసిన అందుడు జనసేన పార్టీ ఎనిమిదో వార్డు ఇన్చార్జ్ వీరేష్. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ప్రజా నాయకుడిగా అందరి మనసులో చెరగని ముద్ర వేశారని, నిరంతరం ప్రజాసేవకై అంకితమైన గొప్ప నాయకుడని అన్నారు. వీరేష్ కు కళ్ళు కనిపించకున్న, పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో, పవన్ కళ్యాణ్ కళ్ళతో, ప్రజలతో ప్రజా సమస్యలపై, నిరంతరంగా స్పష్టంగా మాట్లాడగలడం అతనికి ఉన్న గొప్ప వరం. ప్రజా సమస్యల పట్ల యువ నాయకుడిగా వీరేష్ జనసేన పార్టీ తరఫున నిరంతరం ప్రజలతో సంబంధం బాంధవ్యాలు కొనసాగిస్తున్నాడు. ఈ పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా అందరికీ భోజనాలు అందించి తన మంచి మనసును చాటుకున్నాడు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, ప్రజాసేవకు అంకిత మ వుతానని ఈ సందర్భంగా జనసేన వీరేష్ తెలిపారు.

## ఘనంగా ఎల్ఐసి 70 వ వారోత్సవాలు రెండవ రోజు ర్యాలీ..

-విద్యార్థులకు కాంపిటేటివ్ ఎగ్జామ్- ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ వైకుంఠం





ఎమ్మిగనూరు,శివసూర్య సెప్టెంబర్ 2 :కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎమ్మిగనూరు పట్టణంలో హెచ్ బి ఎస్ కాలనీ యందు ఎల్ఐసి 70వ వారోత్సవాలు రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా బ్రాంచ్ మేనేజర్ వైకుంఠం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఎల్ఐసి 70 వారోత్సవాలు సందర్భంగా రెండవ రోజు ర్యాలీ నిర్వహించారు, సాయంత్రం విద్యార్థులకు కాంపిటేషన్ ఎగ్జామ్ ను కండక్ట్ చేశారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రపంచంలో



ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామి సంస్థ గా ఎల్ఐసి ఒకటిగా ఉందని ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ వైకుంఠం పేర్కొన్నారు. ఎల్ఐసి ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థ. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఒక వెన్నుముకని అన్నారు . ఎల్ఐసి ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి ప్రభుత్వానికి ఉపయోగపడే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు రోడ్లు, విద్య, వైద్యరంగమంపై , హౌసింగ్ వంటి తదితర కార్యక్రమాలకు నిధిని లోన్ రూపంలో ఉపయోగిస్తారు. ఎల్ఐసి ఇందులో అన్ని రకాల వయసులో వారికి పాలసీలు ఉన్నాయని, తమ పిల్లల కలల నెరవేర్చడానికి ఎంతో తోడ్పడుతాయన్నారు. ఎల్ఐసి క్లైముల పరిష్కారంలో 99% పైగానే పాలసీదారులకు అందుతున్నాయన్నారు. ఎల్ఐసి లో పెట్టుబడి పెట్టే ప్రతి పైసా సురక్షితమని వారన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ పాటిల్ తిమ్మారెడ్డి, మధుసూదన్, మోహినుద్దీన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఇందిరా, ప్రతాప్, రవి నాయక్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు విజయకుమార్ , రఘునాథ్ గౌడ్, గోవర్ధన్ మురళి ,శ్రీవాణి, వెంకటేష్, లియాఫీ రాష్ట్ర నాయకులు కాకి రమేష్, ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి , ట్రెజరర్ వీరేష్ , ప్రసాదు స్వామి, ప్రభాకర్, మాధుగుండు ఈరన్న ( సీనియర్ పాత్రికేయులు) సీనియర్ ఏజెంట్లు నందవరం నర్సింలు, గుడికల్ రామాంజనేయులు, గొర్రెవల వీర రత్నయ్య శెట్టి, భూరళి స్వామి, బేతాల్ రెడ్డి, రంగస్వామి, పకీరప్ప, బండ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్జెహళ్లిలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు..!

కూటమి నాయకులు డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు వెల్లువ...



హొళగుంద శివసూర్య న్యూస్ సెప్టెంబర్ 2: స్థానిక మండలం పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనసేన నాయకులు గ్రామంలోని బస్టాండ్ దగ్గర కేక్ కట్ చేసి,టపాసులు పేల్చి పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ... ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, ఆ భగవంతుని చల్లని



దీవెనలు నిండు నూరేళ్ల నీపై ఉండాలని ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని రాజకీయ ప్రస్థానంలో మహోన్నత శిఖరాగ్రాలను చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఎన్నో కష్టాలు ఎదుర్కొని చివరికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా ప్రజాసేవలను చేసుకుంటున్న మన అందరి అభిమాన నటుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ అన్న గారికి మరొక్కసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## జల హారతి కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు కి ఘన స్వాగతం పలికిన

---పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 02: పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్రకు చేరనున్న చారిత్రాత్మక జలహారతి కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రాష్ట్ర మంత్రులతో కలిసి పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ని కలిసి జలహారతి కార్యక్రమానికి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఉత్తరాంధ్ర ప్రాంతానికి గోదావరి జలాలు చేరడం ఎంతో చారిత్రాత్మకమైన విషయమని పేర్కొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైయస్ఆర్ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

--- మెళియాపుట్టిలో ఘనంగా వైయస్ఆర్ 17వ వర్ధంతి వేడుకలు



మెళియాపుట్టి : దివంగత ముఖ్యమంత్రి, మహానేత డా. వై యస్ రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను మెళియాపుట్టి మండలం కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, స్థానిక వైయస్ఆర్ సీపీ నాయకులు, మండల అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ముందుగా వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైయస్ఆర్ చేసిన ప్రజాసేవలను స్మరించుకున్నారు. ముఖ్యమంత్రిగా వైయస్ఆర్ పనిచేసిన సమయంలో పేదలు, రైతులు,



మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు అండగా నిలిచారని ఆమె అన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి అనేక కార్యక్రమాల ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైయస్ఆర్ అని కొనియాడారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వారి కష్టాల్లో అండగా నిలిచిన వైయస్ఆర్ సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. వైయస్ఆర్ మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఆయన సంక్షేమ పాలనను, ప్రజలకు చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు.అనంతరం వైయస్ఆర్ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్ఆర్ సీపీ నాయకులు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత వైయస్ఆర్ గారికి ఘన నివాళులర్పించారు.

## హొళగుందలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

జనసేన ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కూటమి నాయకులు



హొళగుంద శివసూర్య న్యూస్ సెప్టెంబర్ 2 : జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి 55వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని హొళగుంద బస్టాండ్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎం శ్రీ పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్ గారు, టీడీపీ మండల కన్వీనర్



డా. తిప్పయ్య గారు, ఎస్. పాంపాపతి గారు, యరిస్వామి గారు, జనసేన మండల కన్వీనర్ అశోక్ గారు, బీజేపీ మండల కన్వీనర్ ప్రసాద్ గారు, టీడీపీ మండల కో కన్వీనర్ జాకీర్ గారు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వీరన్ గౌడ్ గారు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ గారు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్న గొప్ప నాయకుడని అన్నారు. యువతలో చైతన్యం తీసుకురావడంలో, ప్రజా సేవలో పవన్ కళ్యాణ్ గారు చూపిస్తున్న నిబద్ధత ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి రాష్ట్ర అభివృద్ధికి పవన్ కళ్యాణ్ గారు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.పవన్ కళ్యాణ్ గారికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ఈబీజీ గోవింద్ గౌడ్ గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకులు, కూటమి నాయకులను కూడా శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం కూటమి నాయకులు, కార్యకర్తల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ధిడి వెంకటేష్ గారు, బుడగజంగాల రామాంజీని గారు, ద్వారకనాథ్ గారు, టిడిపి మండలా మైనారిటీ అధ్యక్షుడు ముల్లా మోయిన్,సింధువలం మాలి గారు,కన్నయ గారు జనసేన నాయకులు,బగోడి సీను గారు, చిన్నయాట మలయ్య గారు, పెనేష్, వెంకటేష్, తరుణ్, ప్రకాష్, ఈరన, రవి, టీడీపీ నాయకులు, బీజేపీ నాయకులు,మహేష్ గారు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని డిప్యూటీ సీఎం శ్రీ పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మెళియాపుట్టి మండలంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు





మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 02: మెళియాపుట్టి, రట్టిని, పరశురాంపురం గ్రామాలలో బుధవారం డిప్యూటీ సీఎం పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరశు రాంపురం గ్రామంలో పలువురు జనసేన నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తుముకొండ ఆకుల అమ్మవారు గుడి లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రట్టిని గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ చింతల ప్రశాంత్ స్కూల్ పిల్లలు, మహిళలు, వృద్ధులతో ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్కూల్ పిల్లలుచే కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. మెళియాపుట్టిలో దుక్క బాలరాజు ఆధ్వర్యంలో ముందుగా పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి,కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పుట్టినరోజులు మరింత అంగరంగ వైభవంగా నిర్వహించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మెళియాపుట్టి నుంచి పెద్ద పద్మ పురం, సుందరాడ మీదుగా పాతపట్నం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి అక్కడ శ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో కోరికాన భవాని ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసైనికులు, మహిళలు, వృద్ధులు పాల్గొని పవన్ కళ్యాణ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తెలుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 02: పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు బుధవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన తో పాటు కూటమికి చెందిన నాయకులు, ముఖ్య కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి పలువురికి పంచిపెట్టారు. ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని భగవంతుని కోరారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులు మాట్లాడుతూ...ఆయనకు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.రాష్ట్ర అభివృద్ధిలో డిప్యూటీ సీఎం మరింత ముందుకు సాగాలని,రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి, జనసేన ,బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ సీఈవో ఆధ్వర్యంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 02: శ్రీకాకుళం జిల్లా పరిషత్ సీఈవో , ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆధ్వర్యంలో పాతపట్నం నియోజకవర్గానికి సంబంధించి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఒక కీలక సమీక్షా సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న రీతిలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాబోయే ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల జారీ చేసిన తాజా రీషెడ్యూల్ మార్గదర్శకాలను సమావేశానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులకు, ప్రతినిధులకు సమగ్రంగా వివరించడం జరిగింది. అంతేకాకుండా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు క్షేత్రస్థాయి నుండి స్వీకరించిన అన్ని రకాల క్లెయిమ్‌లు, అభ్యంతరాల వివరాలతో పాటు ఫారం 9, ఫారం 10, ఫారం 11ఏ , ఫారం 11బీలకు సంబంధించిన పూర్తి అధికారిక వివరాల పత్రాలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్వయంగా అందజేశారు. అదేవిధంగా పాతపట్నం ప్రధాన కేంద్రం పరిధిలోని వివిధ పోలింగ్ స్టేషన్ల మధ్య ఓటర్ల మార్పులు, చేర్పుల విషయమై విస్తృతంగా చర్చించి, ఒక పోలింగ్ కేంద్రం నుండి మరొక పోలింగ్ కేంద్రానికి ఓటర్లను బదిలీ చేసేందుకు అవసరమైన ఫారం-8 దరఖాస్తులను అర్హులైన వారందరితో ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే సమర్పించేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సహకారం అత్యంత కీలకమని, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా తుది జాబితాను రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు కోరగా, స్థానిక తహశీల్దార్, ఇతర సంబంధిత ఎన్నికల అధికారులు కూడా పాల్గొని క్షేత్రస్థాయి పరిశీలనలను వేగవంతం చేస్తామని తెలిపారు.

## జిల్లా వైస్ ప్రెసిడెంట్ గూడ రామారావుకు సన్మానం చేసిన

---మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి, శివ సూర్య సెప్టెంబర్ 02: ఏ పీ డబ్ల్యు జే ఎఫ్ శ్రీకాకుళం జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఇటీవలే ఎన్నికైన ప్రజాశక్తి దినపత్రిక విలేకర్ గూడ రామారావును బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు దుస్సాలువతో సత్కరించి సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుగా గూడ రామారావు చేస్తున్న కృషిని ప్రజా ప్రతినిధులు అభినందించారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, పాత్రికేయుల సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఎంపీపీ ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఉర్లాన బాలరాజు, జయముని, వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, మాజీ ట్రైకర్ డైరెక్టర్ ప్రతినిధి సుభాష్, కన్నబాబు, తదితరులు పాల్గొని రామారావును అభినందించారు.

## కడిమెట్లలో మొదలైన అభివృద్ధి జోరు.. రైతుల చేతుల్లో కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు: ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరు,శివసూర్య,సెప్టెంబర్ 2:ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాస్‌బుక్ పంపిణీ -- గ్రామసభ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొని రైతులకు నూతన పట్టాదారు పాస్‌బుక్కులను పంపిణీ చేశారు. రోడ్లమీద ఏం కావాలి నాకు ఏం కావాలిఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లో ప్రభుత్వ లోగో, క్యూఆర్ కోడ్, చుట్టుపక్కల భూముల హద్దులు, ఎల్పీఎ నంబర్లు వంటి పూర్తి వివరాలను పొందుపరిచి రైతులకు మరింత భద్రత, పారదర్శకత కల్పించారు.గతంలో రాజకీయ ఆధిపత్యానికి పేరుగాంచిన కడిమెట్లలో ఇప్పుడు రాజకీయాలు కాదు.. అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా! అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు."పార్టీ చూడం.. ప్రాంతం చూడం.. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ విధానం!" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న



సూపర్-6 సంక్షేమ పథకాల ద్వారా కడిమెట్ల ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను ఎమ్మెల్యే వివరిస్తూ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకల లబ్ధిదారుల పేర్లను స్వయంగా చదివి వినిపించారు.ఎన్నికలప్పుడు కనిపించే రాజకీయాలు కాదు.. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం ఇది! రైతుల భూమికి భద్రత.. ప్రతి కుటుంబానికి సంక్షేమం.. ప్రతి గ్రామానికి అభివృద్ధి! ఇదే కూటమి ప్రభుత్వం.. ఇదే ఎమ్మెల్యే డా. బీవీ జయ నాగేశ్వర రెడ్డి గారి పాలన! అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్,ఎమ్మిగనూరు మండల ఎంఆర్ఓ, ఏఎంసీ చైర్మన్, పీఏసీఎస్ అధ్యక్షులు మరియు డైరెక్టర్లు, ఎంపీడీఓ, రెవెన్యూ మరియు సచివాలయ సిబ్బంది, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాలపై కేంద్రం కీలక ప్రతిపాదన..
# ఇక 20 ఏళ్ల వరకు నడపొచ్చా?

ఈవీ, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాల వయసు పెంచే ప్రతిపాదన

గరిష్ఠ వయోపరిమితి 17, 20 ఏళ్లకు పెంపు

అదనంగా ఐదేళ్ల జాతీయ పర్మిట్ ఆథరైజేషన్‌కు అవకాశం

ఐదేళ్ల రుసుము రూ.82,500గా ప్రతిపాదన

వాహన్ డేటాబేస్‌తో పేపర్‌వర్క్ తగ్గింపు




కమర్షియల్ ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాలకు కేంద్ర ప్రభుత్వం కీలక ప్రతిపాదన చేసింది. జాతీయ పర్మిట్ పరిధిలో ఉన్న ఈ వాహనాల గరిష్ఠ వయసును మరో ఐదేళ్లు పెంచాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించి కేంద్ర రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం జాతీయ పర్మిట్ పరిధిలోని కొన్ని వాణిజ్య వాహనాలకు 12 ఏళ్లు, మరికొన్ని వాహనాలకు 15 ఏళ్ల వయోపరిమితి ఉంది. ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎలక్ట్రిక్, హైడ్రోజన్, సీఎన్‌జీ వాహనాలకు ఈ పరిమితి వరుసగా 17 ఏళ్లు, 20 ఏళ్లకు పెరగనుంది. అయితే ఈ సడలింపు అన్ని కమర్షియల్ వాహనాలకు వర్తించదు. బ్యాటరీ, హైడ్రోజన్, సహజ వాయువుతో నడిచే వాటికే పరిమితం కానుంది. కాలుష్యాన్ని తగ్గించే వాణిజ్య రవాణాను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ ప్రతిపాదన చేసినట్లు తెలుస్తోంది. జాతీయ పర్మిట్ ఉన్న వాహన యజమానులకు మరో వెసులుబాటును కూడా కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం ప్రతి ఏడాది పర్మిట్ ఆథరైజేషన్ పునరుద్ధరించుకోవాల్సి ఉండగా.. ఇకపై ఒకేసారి ఐదేళ్లకు తీసుకునే అవకాశం కల్పించనుంది. వార్షిక రుసుము రూ.16,500గానే ఉంటుంది. ఐదేళ్లకు మొత్తం రూ.82,500 చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలకు సంబంధించిన పత్రాల ప్రక్రియను కూడా సులభతరం చేయాలని కేంద్రం భావిస్తోంది. వాహన్ డేటాబేస్‌ను ఉపయోగించడం ద్వారా కాగితపు పనిని తగ్గించనుంది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ నిబంధనల్లోనూ మార్పులు ప్రతిపాదించింది. బాడీ అమర్చని చాసిస్‌కు ఆరు నెలల తాత్కాలిక రిజిస్ట్రేషన్ ఇవ్వనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో దాన్ని ఒక్కోసారి 30 రోజులు చొప్పున పొడిగించే అవకాశం ఉంటుంది. ఈ ముసాయిదా నిబంధనలపై ప్రజలు, సంబంధిత వర్గాల నుంచి అభ్యంతరాలు, సూచనలు కోరారు. నోటిఫికేషన్ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తేదీ నుంచి 30 రోజుల్లోగా అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది.

## గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్'గా నామకరణం

భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటపడ్డ జీవి

శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించిన సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో

గంగానది పేరుతో దీనికి 'గంగైఇకిస్' అనే పేరు

'చౌధురిడే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తింపు

జూకీస్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన వివరాలు



సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ వీడియో శాస్త్రవేత్తలను ఓ అరుదైన చేప జాతి ఆచూకీ వైపు నడిపించింది. సాధారణంగా చేపలకు ఉండే లక్షణాలకు పూర్తిగా భిన్నంగా, అచ్చం వానపాములా కనిపించిన ఓ చిన్న జీవి భారత్-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో ఓ బోరుబావి నుంచి బయటకు వచ్చింది. 2024లో సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో శాస్త్రవేత్తల దృష్టి దానిపై పడింది. పూర్తిగా చీకటిగా ఉండే భూగర్భ జలాల్లో ఈ జీవి బయటపడటంతో ఇది ఇంతవరకు గుర్తించని కొత్త జాతి కావచ్చని పరిశోధకులు అనుమానించారు. ఈ వింత చేపకు శాస్త్రవేత్తలు 'గంగైఇక్తిస్ ఇండోనేపాలికస్' అనే పేరు పెట్టారు. గంగానది పేరుతో దీనికి 'గంగైఇక్తిస్' అనే పేరు పెట్టినట్లు పరిశోధకులు తెలిపారు. దాదాపు నాలుగు సెంటీమీటర్ల పొడవు ఉండే ఈ చేపకు కళ్లు చాలా చిన్నగా ఉంటాయి. భూగర్భంలో ఎలాంటి వెలుతురు లేకపోవడంతో చూపు అవసరం లేకపోవడమే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ చేపకు పెద్ద రెక్కలు లేవు. నీటితో నిండిన మట్టి పొరలు, భూగర్భంలోని తడి ప్రాంతాల్లో వానపాములా శరీరాన్ని మెలితిప్పుకుంటూ కదులుతుంది. బయటకు చూస్తే వానపాములా కనిపించినప్పటికీ, మైక్రో-సీటీ స్కానింగ్, జన్యు విశ్లేషణల ద్వారా ఇది పూర్తిగా భిన్నమైన చేప జాతి అని పరిశోధకులు నిర్ధారించారు. ఇది 'చౌధురిడే' కుటుంబానికి చెందిన కొత్త జాతిగా గుర్తించారు. ఈ అరుదైన చేపను పట్టుకోవడం మాత్రం పరిశోధకులు చాలా శ్రమించారు. బోరుబావులను గుర్తించి వాటి యజమానుల అనుమతి తీసుకొని పరిశోధకులు నీటిని చేతులతో బయటకు తోడారు. సుమారు 2,000 లీటర్ల నీటిని బయటకు తీసిన తర్వాత మొదటి చేప కనిపించింది. అయితే అది గాయపడి వెంటనే చనిపోయింది. మరో 500 లీటర్ల నీటిని తోడిన తర్వాత రెండో చేప లభించింది. అదే పూర్తి స్థితిలో లభించిన నమూనా కావడంతో దానిని ఈ కొత్త జాతికి 'హోలోటైప్'గా శాస్త్రవేత్తలు గుర్తించారు. ముంబైకి చెందిన ఠాక్రే వైల్డ్‌లైఫ్ ఫౌండేషన్, కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన షాంఘై సింక్రోట్రాన్ రేడియేషన్ ఫెసిలిటీ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ పరిశోధన వివరాలు 'జూకీస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇండో-గంగా మైదానాల్లో, గంగానది పరివాహక ప్రాంతంలో గుర్తించిన తొలి భూగర్భ జల చేపగా దీన్ని పరిశోధకులు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో సాధారణంగా కనిపించిన ఓ వీడియో చివరకు శాస్త్రవేత్తలను భూమి లోపల దాగి ఉన్న అరుదైన జీవ వైవిధ్యాన్ని కనుగొనేలా చేసింది. కోట్లాది మంది జీవనానికి నీరు, ఆహారం, ఉపాధిని అందించే గంగానది పరివాహక ప్రాంతంలో ఇలాంటి వింత జీవి బయటపడటం శాస్త్రవేత్తలకు ఆసక్తికరమైన పరిణామంగా మారింది. సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ ఆవిష్కరణ ఇప్పుడు ప్రపంచ శాస్త్రీయ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది.

## టెస్టుల్లో రిషభ్ పంత్ చరిత్ర..
## 100 సిక్సర్లు కొట్టిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డు!

టెస్టుల్లో పంత్ 100 సిక్సర్లు పూర్తి చేసిన పంత్

ఈ ఘనత సాధించిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు

శ్రీలంకతో గాలె టెస్టులో రికార్డు నమోదు

లహిరు కుమార బౌలింగ్‌లో సిక్సర్

ప్రపంచంలో 100 సిక్సర్లు కొట్టిన నాలుగో బ్యాటర్



టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. శ్రీలంకతో గాలెలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ ఘనత సాధించాడు. లహిరు కుమార బౌలింగ్‌లో భారీ సిక్సర్ కొట్టి పంత్ ఈ మైలురాయిని అందుకున్నాడు. పంత్ తనదైన ఆటతో ఈ రికార్డును సాధించాడు. కుమార వేసిన బంతిని ముందుకు వచ్చి లెగ్ సైడ్ వైపు భారీ షాట్ ఆడాడు. బంతి నేరుగా బౌండరీ దాటి సిక్సర్‌గా వెళ్లింది. దీంతో పంత్ టెస్టు కెరీర్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. అదే సమయంలో టెస్టుల్లో తన 20వ అర్ధశతకాన్ని నమోదు చేశాడు. ఈ ఘనతతో పంత్ ప్రపంచ టెస్టు క్రికెట్‌లో అరుదైన జాబితాలో చేరాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు కొట్టిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ 138 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ 107 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నాడు. పంత్ 100 సిక్సర్లతో మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ కూడా 100 సిక్సర్లు బాదాడు. టెస్టుల్లో పంత్ సిక్సర్ల వేగం కూడా ప్రత్యేకంగా నిలిచింది. అతడు 100 సిక్సర్లను 49.2 బంతులకు ఒకటి చొప్పున సాధించాడు. ఈ విషయంలోనూ పంత్ దూకుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఏ భారత బ్యాటర్ కూడా టెస్టుల్లో 100 సిక్సర్ల మార్క్‌ను అందుకోలేదు. దీంతో పంత్ పేరు భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది.

## అమెరికా కలలకు గండి.. భారీగా పడిపోయిన
# భారతీయుల గ్రీన్ కార్డ్ ఆమోదాలు

భారతీయుల కోసం ఉద్దేశించిన ఈబీ-1ఏ గ్రీన్ కార్డ్ ఆమోదం రేటు భారీగా పతనం

2025లో 49.1శాతంగా ఉన్న రేటు 2026 ప్రథమార్ధంలో 35 శాతానికి క్షీణత

అధికారుల కఠిన వైఖరి వల్లే తిరస్కరణలు పెరిగాయంటున్న ఇమ్మిగ్రేషన్ నిపుణులు

భారత టెక్ ప్రొఫెషనల్స్‌పై ఈ ప్రభావం అత్యధికంగా ఉన్నట్టు వెల్లడి

ప్రత్యామ్నాయంగా కెనడా, యూకే వైపు చూస్తున్న వృత్తి నిపుణులు




అసాధారణ ప్రతిభ కలిగిన వృత్తి నిపుణులకు అమెరికాలో శాశ్వత నివాసం కల్పించే ఈబీ-1ఏ గ్రీన్ కార్డ్ ఆమోదాల విషయంలో భారతీయులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2026 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో భారతీయుల ఆమోదం రేటు కేవలం 35 శాతానికి పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా భారత టెక్నాలజీ నిపుణులపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

గణాంకాలు ఏం చెబుతున్నాయి?

యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) డేటాను విశ్లేషించిన బౌండ్‌లెస్ ఇమ్మిగ్రేషన్ సంస్థ ఈ గణాంకాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరంలో ఈబీ-1ఏ కేటగిరీ కింద భారతీయులు 14,250 పిటిషన్లు దాఖలు చేయగా, వాటిలో 6,993 ఆమోదం పొందాయి. అప్పుడు ఆమోదం రేటు 49.1 శాతంగా ఉంది. కానీ, 2026 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (రెండు త్రైమాసికాలు) దాఖలైన 7,316 పిటిషన్లలో కేవలం 2,571 మాత్రమే ఆమోదం పొందాయి. దీంతో ఆమోదం రేటు 35 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో తిరస్కరణల సంఖ్య కూడా పెరిగింది.

ఎందుకు ఈ పరిస్థితి?

అసాధారణ ప్రతిభ, నైపుణ్యాలు ఉన్న వ్యక్తులు ఈబీ-1ఏ గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకుంటారు. దీనికోసం యూఎస్‌సీఐఎస్ నిర్దేశించిన పది ప్రమాణాలలో కనీసం మూడింటిని దరఖాస్తుదారులు తప్పనిసరిగా అందుకోవాలి. అయితే, గత కొంతకాలంగా అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారులు నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణుల దరఖాస్తుల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

బౌండ్‌లెస్ ఇమ్మిగ్రేషన్ సహ వ్యవస్థాపకుడు జియావో వాంగ్ మాట్లాడుతూ.. "ఈబీ-1ఏ ఆమోదాల తగ్గుదల ప్రభావం భారత టెక్ నిపుణులపై ఎక్కువగా ఉంది. వారి తర్వాత చైనా దరఖాస్తుదారులపై కూడా ఈ ప్రభావం కనిపిస్తోంది" అని తెలిపారు. ఇమ్మిగ్రేషన్ అటార్నీ జోయెల్ యానోవిచ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దరఖాస్తుదారుల నాణ్యత తగ్గలేదని, చట్టంలో మార్పులు రాలేదని, కానీ దరఖాస్తులను పరిశీలించే అధికారులు కఠినమైన ప్రమాణాలను వర్తింపజేస్తున్నారని ఆయన వివరించారు.

### ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ

ఈబీ-1ఏ విభాగంలో తిరస్కరణలు పెరగడం, ఇతర ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డ్ విభాగాలలో సుదీర్ఘ నిరీక్షణ ఉండటంతో చాలా మంది భారతీయులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారు. కొందరు ఈబీ-1సీ (మల్టీనేషనల్ మేనేజర్), ఈబీ-5 (పెట్టుబడిదారుల కార్యక్రమం) వంటి ఇతర మార్గాలను పరిశీలిస్తున్నారు. మరికొందరు అమెరికాను వీడి కెనడా, యూకే వంటి దేశాలకు వలస వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొత్తం మీద అమెరికాలో నైపుణ్యం కలిగిన వలసదారుల పట్ల పెరుగుతున్న కఠిన వైఖరి, ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతుల వలస సరళిని మార్చేలా కనిపిస్తోంది.

# భారత్‌లో పిల్లల అశ్లీల కంటెంట్‌పై మెటా ఉక్కుపాదం..

ప్రభుత్వంతో చర్చల వేళ కీలక నిర్ణయం

పిల్లల అశ్లీల కంటెంట్‌పై చర్యలను ముమ్మరం చేసిన టెక్ దిగ్గజం మెటా

కేంద్ర ఐటీ శాఖతో చర్చల నేపథ్యంలో ఈ కీలక పరిణామం

నిబంధనలు పాటించకపోతే 'సేఫ్ హార్బర్' రక్షణ ఉండదని ప్రభుత్వం స్పష్టీకరణ

ఒకసారి తీసేసిన కంటెంట్ మళ్లీ రాకుండా నిరోధించేందుకు ప్రత్యేక చర్యలు

కంటెంట్ విధానాల్లో భారతీయ సంస్కృతిని పరిగణనలోకి తీసుకోవాలని సూచన




భారత్‌లోని తమ ప్లాట్‌ఫామ్‌లలో పిల్లలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ (సీఎస్ఏఎం) వ్యాప్తిని అడ్డుకోవడంతో పాటు, అది మళ్లీ ప్రత్యక్షం కాకుండా అరికట్టేందుకు అమెరికా టెక్ దిగ్గజం మెటా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంతో జరుపుతున్న చర్చల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

'ఎన్డీటీవీ' ప్రాఫిట్ కథనం ప్రకారం.. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, మెటా మధ్య ఈ విషయంపై కీలక చర్చలు జరిగాయి. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను మెటా ఎలా నిర్వహిస్తోంది, ఒకసారి గుర్తించి తొలగించిన హానికరమైన కంటెంట్ మళ్లీ ప్రత్యక్షం కాకుండా నిరోధించడంలో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల బాధ్యతపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి. పిల్లలపై లైంగిక వేధింపుల కంటెంట్ భారతీయ చట్టాలను స్పష్టంగా ఉల్లంఘించడమే కాబట్టి, ఈ విషయంలో మెటా చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఒకసారి ఫ్లాగ్ చేసి తొలగించిన కంటెంట్ మళ్లీ సర్క్యులేట్ కాకుండా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది.

'సేఫ్ హార్బర్' రక్షణపై ప్రభుత్వం స్పష్టత

ఈ నివేదికలోని వర్గాల సమాచారం ప్రకారం.. చట్టపరమైన నిబంధనలను పాటించడంలో విఫలమైతే, ప్లాట్‌ఫామ్‌లకు 'సేఫ్ హార్బర్' (చట్టపరమైన రక్షణ) లభించదని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సెన్సార్‌షిప్ విధించడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, భారతీయ చట్టాలకు కట్టుబడి ఉండేలా చూడటమే తమ లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. సామాజిక ప్రయోజనాలకు, హానికరమైన అంశాలకు మధ్య ప్లాట్‌ఫామ్‌లు సరైన సమతుల్యతను పాటించాల్సిన అవసరం ఉందని కూడా నివేదిక పేర్కొంది.

సోషల్ మీడియా వ్యసనం, దోపిడీకి సంబంధించిన కంటెంట్ వ్యాప్తి వంటివి కూడా ఆందోళన కలిగించే అంశాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో కంటెంట్ మోడరేషన్ విధానాల రూపకల్పన, అమలులో స్థానిక సాంస్కృతిక సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యమని ప్రభుత్వం నొక్కి చెప్పినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఇంటర్మీడియరీలు సేఫ్ హార్బర్ రక్షణను కోల్పోయే అవకాశం ఉన్నప్పటికీ, ఏదైనా నిర్దిష్ట సందర్భంలో ఆ రక్షణ వర్తిస్తుందా లేదా అనేది చట్టపరమైన నిబంధనల పాటింపు ఆధారంగా కోర్టులు నిర్ణయిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల కంటెంట్ విధానాలు, వినియోగదారుల భద్రతపై నియంత్రణ సంస్థల నిఘా పెరుగుతున్న తరుణంలో ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## 5జీతో వేగం.. 6జీ పైనా భారత్ దృష్టి..
# నివేదికలో ఆసక్తికర విషయాలు!

2030 నాటికి భారత్‌లో 62 శాతానికి చేరనున్న 5జీ వినియోగం

ఆసియా పసిఫిక్ సగటును అధిగమించనున్న ఇండియా

కవరేజీ కంటే వినియోగం పెంచడమే అసలు సవాల్ అని వెల్లడి

భారత్ డిజిటల్ ప్రగతిపై జీఎస్ఎంఏ నివేదికలో ప్రశంసలు




5జీ టెక్నాలజీ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని, 2030 నాటికి దేశంలో 5జీ స్వీకరణ 62 శాతానికి చేరుకుంటుందని 'గ్లోబల్ మొబైల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్'(జీఎస్ఎంఏ) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంత సగటు 50 శాతం కంటే గణనీయంగా ఎక్కువ కావడం విశేషం. ఈ ప్రాంతంలో బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్‌లతో పాటు భారత్‌ను కూడా 'ప్రముఖ దేశం'గా జీఎస్ఎంఏ గుర్తించింది.

ఒకప్పుడు నెట్‌వర్క్ కవరేజీ పెద్ద సవాల్‌గా ఉండగా, ఇప్పుడు దేశంలో ఆ సమస్య దాదాపు పరిష్కారమైందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం కవరేజీ గ్యాప్ 5 శాతానికి పడిపోవడంతో అసలు సవాల్ కవరేజీ నుంచి వినియోగం, స్వీకరణ వైపు మారిందని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు, డిజిటల్ నైపుణ్యాల కొరత, ఆన్‌లైన్ భద్రతపై నమ్మకం వంటివి మొబైల్ ఇంటర్నెట్ వాడకానికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని వివరించింది.

ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను నివేదిక ప్రశంసించింది. 'భారత్‌నెట్', 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పీఎంజీదిశ)' వంటి పథకాలను ఉదాహరణగా పేర్కొంది. పీఎంజీదిశ ద్వారా ఇప్పటికే 6.4 కోట్ల మంది గ్రామీణ పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేసింది. అదే సమయంలో డిజిటల్ నమ్మకాన్ని పెంపొందించడం కూడా భారత్‌కు ఆర్థిక ప్రాధాన్యతగా మారుతోందని, 2026 నాటికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై చేసే ఖర్చు 11.7 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు దేశంలో అమలవుతున్న డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం దోహదపడుతోందని తెలిపింది.

టెక్నాలజీలో స్వావలంబనపై భారత్ దృష్టి సారించిందని, 'ఆత్మనిర్భర్ భారత్' విధానం ఇందుకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని వాడటం, దానిని 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే వీలుండటం గొప్ప విషయమని తెలిపింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పటికే 6జీ స్పెక్ట్రమ్ రోడ్‌మ్యాప్‌ను కూడా ప్రకటించడం దాని దీర్ఘకాలిక ప్రణాళికకు అద్దం పడుతోందని వివరించింది. 5జీ, కృత్రిమ మేధ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటివి తయారీ, సేవల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని నివేదిక అంచనా వేసింది.

# సిమెంటు, ఇటుకలు, ఏఐ.. రియల్ ఎస్టేట్ కొత్త ఫార్ములా ఇదే!

### భారత రియల్ ఎస్టేట్ రంగంలో ఏఐ వినియోగం విస్తృతం

భారత రియల్ ఎస్టేట్ రంగం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి. సిమెంట్, ఇటుకల వంటి సంప్రదాయ సామగ్రితో పాటు ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఈ రంగంలో కీలక శక్తిగా మారుతోంది. గతంలో కేవలం కస్టమర్లను ఆకట్టుకునే వర్చువల్ టూర్లు, చాట్‌బాట్‌లకు పరిమితమైన ఏఐ, ఇప్పుడు నిర్మాణ రంగం మూలాల్లోకి చొచ్చుకెళ్లి ప్రణాళిక, వ్యయ నియంత్రణ, ప్రాజెక్టుల నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం భారతదేశ రియల్ ఎస్టేట్ మార్కెట్ విలువ సుమారు 650 బిలియన్ డాలర్లు కాగా, 2047 నాటికి ఇది 5.8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ అంచనా వేసింది. ఈ భారీ వృద్ధిని అందుకోవాలంటే నిర్మాణంలో వేగం, సామర్థ్యం పెరగడం తప్పనిసరి. ఇక్కడే ఏఐ డెవలపర్లకు కొత్త మార్గాన్ని చూపిస్తోంది. రాబోయే ఏడేళ్లలో ఒక్క జనరేటివ్ ఏఐ వాడకం వల్ల రియల్ ఎస్టేట్ స్థూల విలువకు (+వాా) సుమారు వ14-17 బిలియన్ల అదనంగా జత అవుతాయని జ్-పార్థినాన్, క్రెడాయ్ సంస్థల సంయుక్త నివేదిక పేర్కొంది. గతంలో ఏఐ అంటే డిజిటల్ మార్కెటింగ్, వ్యక్తిగత సిఫార్సులు మాత్రమే. కానీ ఇప్పుడు "ఏఐ ఏం చేయగలదు?" అనే ప్రశ్న స్థానంలో "మన తదుపరి ప్రాజెక్టులో ఏఐని ఎంత వేగంగా అమలు చేయాలి?" అనే చర్చ మొదలైంది. ఏ ప్రాజెక్టు ఎప్పుడు, ఎక్కడ




నిర్మించాలి, ఖర్చు ఎంత అవుతుంది, నిర్మాణంలో ఎదురయ్యే రిస్క్‌లను ముందుగానే ఎలా గుర్తించాలి వంటి కీలక నిర్ణయాల్లో ఏఐ ప్రధాన పాత్ర పోషిస్తోంది.

ఏఐతో కలిగే ప్రయోజనాలు:

ఏఐ వాడకం వల్ల అమ్మకాల వేగం 30-50% పెరగడంతో పాటు, ప్రాజెక్టులను మార్కెట్లోకి విడుదల చేసే ప్రక్రియలో 30% వేగం పుంజుకుంటుందని అంచనా. సిబ్బంది ఉత్పాదకత 20-50% మేర మెరుగుపడుతుంది. భూమి కొనుగోలు ఒప్పందాలు 30-35% వేగంగా పూర్తవుతాయి. మాన్యువల్ రిపోర్టింగ్ శ్రమ 30-40% తగ్గుతుంది. రిస్క్‌లను ముందుగానే పసిగట్టడం ద్వారా ప్రాజెక్టుల పూర్తి సమయం 5-10% మెరుగుపడుతుంది. పవర్‌ప్లే, ఇంకర్స్ టెక్నాలజీస్ వంటి సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ టూల్స్.. ఇంజనీర్లు ఇచ్చే డ్రాయింగ్‌లు, సైట్ ఫోటోలు, వాయిస్ నోట్స్ వంటి అసంపూర్ణ డేటాను సైతం విశ్లేషించి కచ్చితమైన అంచనాలు అందిస్తున్నాయి. గతంలో రోజుల తరబడి పట్టే వ్యయ అంచనా పనులు ఇప్పుడు కొన్ని గంటల్లోనే పూర్తవుతున్నాయి. లగ్జరీ ఇళ్లలో ఏఐ ఆధారిత బయోమెట్రిక్ యాక్సెస్, స్మార్ట్ హోమ్ ఆటోమేషన్, నివాసితులను గుర్తించే లిఫ్టులు వంటివి వస్తున్నాయి. కార్పొరేట్ రియల్ ఎస్టేట్‌లోనూ ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2023లో 5% కంటే తక్కువగా ఉన్న కంపెనీలు, 2025 నాటికి 91% ఏఐని వాడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయని జేఎల్ఎల్ డేటా చెబుతోంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు ఉన్నప్పటికీ, ఇది ప్రధానంగా డాక్యుమెంటేషన్, రిపోర్టింగ్, అంచనాలు వేయడం వంటి పునరావృత పనులను మాత్రమే చేస్తుందని, తద్వారా ఇంజనీర్లు, ఇతర నిపుణులు కీలక నిర్ణయాలపై దృష్టి పెట్టేందుకు సమయం దొరుకుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం దేశంలోని సంఘటిత డెవలపర్లలో 15-20% మంది పూర్తిస్థాయిలో ఏఐని వాడుతుండగా, మరో 30-40% పైలట్ ప్రాజెక్టులు నడుపుతున్నారు. మొత్తంగా, భారత రియల్ ఎస్టేట్ రంగం తన భారీ లక్ష్యాలను చేరుకోవడంలో ఏఐ ఒక మార్కెటింగ్ సాధనంగా కాకుండా, ప్రధాన కార్యాచరణ శక్తిగా మారుతోందనడంలో సందేహం లేదు.

# ఉల్లిపాయ కోస్తే కన్నీళ్లు ఎందుకు వస్తాయి? ఈ 3 చిట్కాలతో ఇక ఆ బాధ ఉండదు!



ఉల్లిపాయ కోసినప్పుడు విడుదలయ్యే ఘాటు పదార్థంతో కళ్లలో మంట

ఆ మంటను తగ్గించేందుకు కళ్లు కన్నీళ్లను ఉత్పత్తి చేస్తాయి

ఉల్లిపాయను అరగంట ఫ్రిజ్‌లో ఉంచితే మంట తగ్గొచ్చు

పదునైన కత్తితో కోస్తే కన్నీళ్లు తగ్గే అవకాశం

గాగుల్స్ పెడితే రసాయనాల ఆవిరి కళ్లను చేరదు

ఉల్లిపాయ కోయడం మొదలుపెట్టగానే కళ్లలో నీళ్లు తిరుగుతాయి. ఎంత త్వరగా కోసినా.. అవి మాత్రం ఆగవు. అసలు ఉల్లిపాయకు, మన కన్నీళ్లకు సంబంధమేంటి? దీనంతటికీ ఓ చిన్న కెమిస్ట్రీ కారణం ఉంది. అంతేకాదు.. ఉల్లిపాయ కోసేటప్పుడు కన్నీళ్లు తగ్గించుకునేందుకు మూడు సింపుల్ ట్రిక్స్ కూడా ఉన్నాయి. ఉల్లిపాయను కోసినప్పుడు దాని కణాలు దెబ్బతింటాయి. దీంతో లోపల విడివిడిగా ఉన్న సల్ఫర్ సమ్మేళనాలు, 'అల్లినేస్' అనే ఎంజైమ్ ఒకదానితో ఒకటి చర్య జరుపుతాయి. ఫలితంగా 'ప్రొపానెథియల్-ఎస్-ఆక్సైడ్' అనే కంటికి మంట కలిగించే పదార్థం తయారవుతుంది. అది గాలిలో కలిసి కళ్లను తాకగానే కన్నీళ్లు వస్తాయి.

ఫ్రిజ్‌లో పెట్టి కోయండి

ఉల్లిపాయ కోయడానికి ముందు దాన్ని సుమారు అరగంట ఫ్రిజ్‌లో పెట్టండి. చల్లగా ఉన్న ఉల్లిపాయలో ఈ రసాయన చర్య కొంత నెమ్మదిగా జరుగుతుంది. దాంతో కళ్లకు చేరే ఘాటు ఆవిరి కూడా కొంత తగ్గుతుంది. ఫ్రిజ్ నుంచి తీసిన వెంటనే కోస్తే మంచి ఫలితం ఉండొచ్చు.

కత్తి పదునుగా ఉండాలి

మొద్దుబారిన కత్తితో ఉల్లిపాయను కోస్తే.. అది సరిగ్గా కోయడం కంటే ఎక్కువగా నలిగిపోతుంది. దాంతో ఉల్లిపాయలోని ఎక్కువ కణాలు దెబ్బతింటాయి. ఫలితంగా కళ్లకు మంట పెట్టే పదార్థం ఎక్కువగా బయటకు వస్తుంది. అందుకే పదునైన కత్తితో ఒక్కో ముక్కను వేగంగా, సాఫీగా కోయడం మంచిది. దీనివల్ల కన్నీళ్లు తగ్గడంతో పాటు కత్తి జారే ప్రమాదం కూడా తగ్గుతుంది.

కళ్లకు గాగుల్స్ పెట్టుకోండి

ఇది కాస్త విచిత్రంగా అనిపించినా.. బాగా పనిచేసే చిట్కా ఇదే. కిచెన్ గాగుల్స్ లేదా స్విమ్మింగ్ గాగుల్స్ పెట్టుకుని ఉల్లిపాయ కోస్తే ఆ ఘాటు ఆవిరి కళ్లను చేరదు. దీంతో కన్నీళ్లు వచ్చే అవకాశం బాగా తగ్గుతుంది. గాగుల్స్ లేకపోతే ఎగ్జాస్ట్ ఫ్యాన్ దగ్గర ఉల్లిపాయ కోయడం లేదా కిటికీ తెరిచి ఉంచడం కూడా ఉపయోగపడుతుంది. అయితే అన్ని ఉల్లిపాయలు ఒకేలా ఉండవు. కొన్ని రకాల ఉల్లిపాయలు ఎక్కువ ఘాటుగా ఉంటాయి. వాటిని కోసినప్పుడు కన్నీళ్లు కూడా ఎక్కువగా వస్తాయి. అంటే.. మీరు ఉల్లిపాయపై కోప్పడాల్సిన అవసరం లేదు. అది తనను తాను కాపాడుకునేందుకు చేసే ఓ చిన్న రసాయన ప్రక్రియే. మన కళ్లు దానికి స్పందించి నీళ్లు కారుస్తాయంతే.

# రోజూ అవే బాయిల్డ్ ఎగ్స్‌తో విసుగొచ్చిందా?.. ఈ సింపుల్ వెరైటీలు ట్రై చేయండి!

ప్రోటీన్ కోసం తినే ఉడికించిన గుడ్లు బోర్ కొట్టకుండా తినే మార్గాలు

చాట్ మసాలా, మిరియాల పొడితో రుచికరమైన స్నాక్స్‌గా మార్చుకోవచ్చు

ఉల్లిపాయ, టమాటాలతో ఎగ్ చాట్ లేదా బ్రెడ్ టోస్ట్‌పై అల్పాహారంగా తీసుకోవచ్చు

పెరుగు, కూరగాయలతో కలిపి శాండ్‌విచ్‌లు, సలాడ్లు, రోటీ రోల్స్ తయారు చేసుకోవచ్చు

ఈ పద్ధతులకు అదనపు వంట అవసరం లేకుండానే భోజనంలో వైవిధ్యం తీసుకురావచ్చు



ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్నవారు, బరువు తగ్గాలనుకునేవారు ప్రోటీన్ కోసం తరచుగా ఉడికించిన గుడ్లను తమ ఆహారంలో చేర్చుకుంటారు. అయితే, రోజూ ఒకేలా తినడం వల్ల త్వరగా బోర్ కొడుతుంది. కానీ, కొన్ని సింపుల్ చిట్కాలతో అవే బాయిల్డ్ ఎగ్స్‌ను ఎంతో రుచికరమైన స్నాక్స్‌గా, తేలికపాటి భోజనంగా మార్చుకోవచ్చు. దీనికోసం వంటింట్లో ఉండే సాధారణ పదార్థాలే సరిపోతాయి. ఎలాంటి అదనపు వంట అవసరం లేకుండానే వీటిని క్షణాల్లో సిద్ధం చేసుకోవచ్చు.

త్వరిత స్నాక్స్, చాట్‌గా..

ఉడికించిన గుడ్డును రెండు ముక్కలుగా కోసి, దానిపై కొద్దిగా చాట్ మసాలా, మిరియాల పొడి, కారం, నిమ్మరసం చల్లుకుంటే నిమిషాల్లో మసాలా స్నాక్ సిద్ధమవుతుంది. లేదా గుడ్లను చిన్న ముక్కలుగా కట్ చేసి, అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ, టమాటా, కీర దోస, కొత్తిమీర వేసి, నిమ్మరసం, చాట్ మసాలా కలిపితే రుచికరమైన 'ఎగ్ చాట్' రెడీ అవుతుంది. ఇది సాయంత్రం వేళల్లో తినడానికి అద్భుతంగా ఉంటుంది.



అల్పాహారంలో కొత్తగా..

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కోసం, ఉడికించిన గుడ్డును మెత్తగా చేసి, గోధుమ బ్రెడ్ టోస్ట్‌పై స్ప్రెడ్ చేయాలి. దానిపై మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్, టమాటా ముక్కలు వేసుకుంటే సరి. మరింత క్రీమీగా కావాలనుకుంటే, గుడ్డుతో పాటు అవకాడోను కలిపి టోస్ట్‌పై పెట్టుకోవచ్చు. ఇది పోషకాలతో కూడిన మంచి అల్పాహారం. అలాగే, నీళ్లు తీసేసిన గట్టి పెరుగులో ఉడికించిన గుడ్లను మెత్తగా చేసి, మిరియాల పొడి, మూలికలు కలిపి శాండ్‌విచ్‌గా కూడా తయారు చేసుకోవచ్చు.

సలాడ్లు, రోల్స్‌గా..

గుడ్లతో స్పైసీ సలాడ్ కూడా చేసుకోవచ్చు. కీర దోస, లెట్యూస్, టమాటా, ఉల్లిపాయ ముక్కలలో ఉడికించిన గుడ్ల ముక్కలు వేసి, నిమ్మరసం, కొత్తిమీర, పుదీనా వంటివి కలిపితే సరి. అదేవిధంగా, ఉడికించిన గుడ్ల ముక్కలను మొలకెత్తిన పెసలు, కీర, టమాటాలతో కలిపి, కొద్దిగా మసాలాలు జోడిస్తే అధిక ప్రోటీన్లు ఉండే బౌల్ సిద్ధమవుతుంది. గుడ్లను ముక్కలుగా కోసి, కూరగాయలు, చట్నీతో కలిపి రోటీ లేదా చపాతీలో రోల్ చేసుకుంటే 'ఎగ్ రోల్'గా తినొచ్చు. ఈ పద్ధతుల వల్ల గుడ్లలోని పోషక విలువలు ఏమాత్రం తగ్గకుండా, రోజూ తినే భోజనంలో వైవిధ్యం తీసుకురావచ్చు. ఇది రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం అందిస్తుంది.

# పేగుల్లో మంచి బ్యాక్టీరియా కేవలం జీర్ణ వ్యవస్థకే కాదు, వీటికి కూడా అవసరమే..!



ఇప్పటికే చాలా మందికి ప్రోటీన్ తీసుకోవడం, స్ట్రెంగ్త్ ట్రైనింగ్, ఎక్కువ కాలరీలు తీసుకోవడం కండరాల పెరుగుదలకు ముఖ్యమని తెలుసు. అయితే, ఇటీవల జరిగిన ఒక అధ్యయనం కండరాల శక్తి, శారీరక పనితీరును ప్రభావితం చేసే మరో ముఖ్య అంశాన్ని గుర్తించింది. పేగుల్లో ఉండే ఒక ప్రత్యేకమైన మంచి బ్యాక్టీరియా కండరాల బలం పెంచడంలో నేరుగా సహాయపడుతుందని ఈ పరిశోధన వెల్లడించింది. ఇది గట్-మసిల్ యాక్సిస్ అనే కొత్త భావనకు బలమైన ఆధారాలను అందిస్తోంది. అంటే పేగులలోని సూక్ష్మజీవుల వాతావరణం కండరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. గట్-మసిల్ యాక్సిస్ అనేది జీర్ణవ్యవస్థ (గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ట్రాక్ట్), కండరాల మధ్య ఉండే ద్విముఖ సంబంధం. పేగుల ఆరోగ్యం కండరాల పరిమాణం, పనితీరును ప్రభావితం చేస్తుంది. అదే సమయంలో శారీరక వ్యాయామం కూడా పేగులలోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేందుకు దోహదపడుతుంది.

### పెరిగిన కండరాల పనితీరు..

గట్ అనే జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం రోసిబ్యూరియా ఇనులినివోరాన్స్ (=శింవఎబతీఋ అఅబశ్రీఅఅఙశీ-ఖీఅం) అనే మంచి బ్యాక్టీరియా కండరాల పనితీరుకు సహజ బూస్టర్‌లా పనిచేస్తుందని వెల్లడైంది. ఇది కేవలం ఆహారాన్ని జీర్ణం చేయడమే కాకుండా, కండరాలు నిర్మాణం అయ్యేందుకు, సమర్థవంతంగా పనిచేయడానికి సంకేతాలు పంపుతుంది. ఇక ఈ పరిశోధనల్లో కొన్ని ముఖ్యాంశాలను కూడా పరిశోధకులు గుర్తించారు. వృద్ధుల్లో ఈ బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారికి హ్యాండ్‌గ్రిప్ శక్తి దాదాపు 30 శాతం ఎక్కువగా కనిపించిందని గుర్తించారు. యువతలో ఈ బ్యాక్టీరియా శక్తి మాత్రమే కాకుండా స్టామినా పెరుగుదలతో కూడా సంబంధం కలిగి ఉంది. ఎలుకలపై చేసిన పరీక్షల్లో ఈ బ్యాక్టీరియా ఇచ్చిన గ్రూప్‌లో గ్రిప్ శక్తి 30 శాతం పెరిగింది. మనుషుల్లో కూడా ఈ బ్యాక్టీరియా అధికంగా ఉన్నవారికి లెగ్ ప్రెస్, బెంచ్ ప్రెస్ వంటి వ్యాయామాల్లో మెరుగైన ఫలితాలు కనిపించాయి.

### కండరాలకు శక్తిని ఇస్తుంది..

ఇక ఈ బ్యాక్టీరియా శరీరంలో అమినో ఆమ్లాల వినియోగాన్ని మార్చుతుంది. ఇది కండరాలకు అవసరమైన శక్తి మార్గాలను యాక్టివేట్ చేసి, కండర కణాలు అధిక శక్తిని ఉత్పత్తి చేసుకునేలా సహాయపడుతుంది. సాదారణంగా చెప్పాలంటే ఇది కండరాలకు ఇంధనం అందించే విధానాన్ని మెరుగుపరుస్తుంది. పేగుల్లో లక్షల కోట్ల సూక్ష్మజీవులు (మైక్రోబయోమ్) ఉంటాయి. వీటిలో రోసిబ్యూరియా వంటి మంచి బ్యాక్టీరియా ఎక్కువగా ఉన్నవారు, వ్యాయామం తక్కువ చేసినా కూడా సహజంగా బలంగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

### పేగుల ఆరోగ్యం మెరుగైతే..

పేగుల ఆరోగ్యం మెరుగైతే కండరాల శక్తి కూడా మెరుగవుతుంది. అందుకే కొన్ని అలవాట్లు పాటించడం ద్వారా గట్ మసిల్ యాక్సిస్‌ను మెరుగుపరుచుకోవచ్చు. దీని కోసం ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇది మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఇది మైక్రోబయోమ్ వైవిధ్యాన్ని పెంచుతుంది. ప్రోబయోటిక్స్, ప్రీబయోటిక్స్ ఆహారంలో చేర్చాలి. ఇవి పేగుల సమతుల్యతను మెరుగుపరుస్తాయి. ఈ పరిశోధన ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతోంది. కండరాల పెరుగుదల కేవలం ప్రోటీన్ షేక్స్ లేదా బరువులు ఎత్తడంపైనే ఆధారపడదు. పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ప్రోబయోటిక్స్ కూడా కండరాల బలం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# చికున్‌గున్యా తగ్గినా కీళ్ల నొప్పులు వీడట్లేదా?.. నిపుణులు ఏం చెబుతున్నారు?

చికున్‌గున్యా తర్వాత వచ్చే కీళ్ల నొప్పులు వ్యాధి తిరగబెట్టడమే కానీ రీఇన్‌ఫెక్షన్ కాదు

శరీరంలో వైరస్ లేకపోయినా కీళ్లలో దాని అవశేషాలు నొప్పిని ప్రేరేపిస్తాయంటున్న నిపుణులు

10-15% మంది రోగులు ఏడాదికి పైగా దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్నారని వెల్లడి

45 ఏళ్లు పైబడిన వారు, మహిళల్లో ఈ సమస్య తిరగబెట్టే ముప్పు అధికం

దీర్ఘకాలిక నొప్పులకు వైద్యుల పర్యవేక్షణ, సరైన చికిత్స తప్పనిసరి

చికున్‌గున్యా బారిన పడి కోలుకున్న తర్వాత కూడా నెలలు, ఒక్కోసారి సంవత్సరాల తరబడి కీళ్ల నొప్పులు, వాపులు, కీళ్లు బిగుసుకుపోవడం వంటి సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. అయితే, ఇది మళ్లీ చికున్‌గున్యా వైరస్ సోకడం (రీఇన్‌ఫెక్షన్) కాదని, ఇది కేవలం వ్యాధి తిరగబెట్టడం (పోస్ట్-వైరల్ రిలాప్స్) మాత్రమేనని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చికున్‌గున్యా ఒకసారి వస్తే, శరీరంలో దాన్ని ఎదుర్కొనే యాంటీబాడీలు దీర్ఘకాలం, కొన్నిసార్లు జీవితాంతం రక్షణ కల్పిస్తాయి. అందుకే.. మళ్లీ అదే వైరస్ సోకడం అనేది అత్యంత అరుదుగా జరుగుతుందని చెబుతున్నారు.

అసలు ఎందుకు తిరగబెడుతుంది?

చికున్‌గున్యా సోకినప్పుడు వైరస్ రక్తప్రవాహం నుంచి తొలగిపోయినా, దాని జన్యుపదార్థం (వైరల్ ఆర్ఎన్ఏ) లేదా ప్రొటీన్ల అవశేషాలు కీళ్లలోని సైనోవియల్ కణజాలం, మాక్రోఫేజ్‌ల వంటి భాగాల్లో ఉండిపోతాయి. ఈ అవశేషాలు స్థానికంగా రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించి, వాపు, నొప్పికి కారణమవుతాయి. దీన్నే "పోస్ట్-చికున్‌గున్యా క్రానిక్ ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్" అని పిలుస్తారు. కొన్ని సందర్భాల్లో రోగనిరోధక వ్యవస్థ పొరబడి శరీరంలోని కీళ్ల కణజాలంపైనే దాడి చేస్తుంది. ఇది ఆటో ఇమ్యూన్ సమస్య తరహాలో ఉండి, నొప్పులను మరింత తీవ్రతరం చేస్తుంది. చాలా మంది రోగులు తమకు మళ్లీ వైరస్ సోకిందని ఆందోళన చెందుతారని, కానీ శరీరంలో వైరస్ చైతన్యవంతంగా ఉండదని నిపుణులు వివరిస్తున్నారు.

గణాంకాలు, ముప్పు ఎవరికి ఎక్కువ?

అధ్యయనాల ప్రకారం, చికున్‌గున్యా సోకిన వారిలో దాదాపు 10 నుంచి 15 శాతం మంది ఒక సంవత్సరానికి పైగా దీర్ఘకాలిక కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. కొందరిలో ఈ నొప్పులు 36 నెలల (3 సంవత్సరాల) వరకు కూడా తిరగబెడుతున్నట్లు నివేదికలు ఉన్నాయి. 45 ఏళ్లు పైబడిన వారు, మహిళలు, ఇప్పటికే కీళ్ల వాతం వంటి సమస్యలు ఉన్నవారిలో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. వాతావరణ మార్పులు, అధిక శ్రమ, మానసిక ఒత్తిడి లేదా ఇతర ఇన్‌ఫెక్షన్లు సోకినప్పుడు ఈ నొప్పులు మళ్లీ తీవ్రమయ్యే అవకాశం ఉంది.



నిర్వహణ.. చికిత్స

ఈ దీర్ఘకాలిక నొప్పులు తిరగబెట్టినప్పుడు సొంత వైద్యం చేసుకోకుండా తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలి. వైద్యుల పర్యవేక్షణలో నాన్-స్టిరాయిడల్ యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వాడాల్సి ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉన్నవారికి డిసీజ్-మాడిఫైయింగ్ ఏజెంట్లు వంటి శక్తివంతమైన మందులను సూచిస్తారు. వీటితో పాటు, కీళ్లపై భారం పడని తేలికపాటి వ్యాయామాలు, ఫిజికల్ రిహాబిలిటేషన్, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ జీవనశైలిని అలవర్చుకోవడం చాలా ముఖ్యం. చికున్‌గున్యా నుంచి కోలుకున్న 4 నుంచి 6 వారాల తర్వాత కూడా నొప్పి తగ్గకపోతే, లేదా కీళ్లలో స్పష్టమైన వాపు, ఎరుపు, ఉదయం పూట కీళ్లు ఎక్కువసేపు బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే రుమటాలజిస్ట్‌ను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నొప్పులు తిరగబెట్టడం వల్ల రోగి నుంచి ఇతరులకు వ్యాధి సంక్రమించదని, ఇది అంటువ్యాధి కాదని గుర్తుంచుకోవాలి.



## శ్రీ శ్రీ శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామినీ కుటుంబ సమేతంగా దర్శించుకున్న మాజీ రాజ్యసభ సభ్యుడు

టి జి ఎంకటేష్ గుప్త





కౌతాళం 02.09.2026ధి నరేష్.కౌతాళం మండలం లో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామినీ కుటుంబ సమేతంగా మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ గుప్తా వారి సతీమణి బుధవారం దర్శించుకున్నారు.ముందుగా టీజీ వెంకటేష్ వారి సతీమణినీ ఆలయ ఈవో శ్రీమతి వాణి మర్యాదపూర్వకంగా మేలతాళాలతో స్వాగతం పలికి అర్చకులు, వేద పండితులతో ఆశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ శెట్టి మాట్లాడుతూ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం చాలా ప్రసిద్ధిగాంచిన దేవాలయం ఈ దేవాలయంలో కులమతాలకు అతీతంగా భక్తులు స్వామిని దర్శించుకుంటారని, అలాగే ఆలయ అభివృద్ధికి మా వంతు సహాయం కూడా అందిస్తామని పత్రిక ముఖంగా తెలియజేశారు. ఈయన వెంట ఉరుకుంద ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ టి జి పాండురంగయ్య శెట్టి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు విట్టా రమేష్, కౌతాళం ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్ శెట్టి గౌరవ అధ్యక్షులు రాఘవేంద్ర శెట్టి ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి మురళికిఆర్టీసీడిపో మేనేజర్ గా పదోన్నతి ఆర్టీసీ కార్మికులు శుభాకాంక్షలు



పశ్చిమగోదావరి జిల్లా తణుకుతణుకు ఆర్టీసీ డిపోలో గొల్లపల్లి మురళి అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేసి పదోన్నతి పై రాజోలు ఆర్టీసీ డిపోకు మేనేజర్ గా వెళ్ళుచున్న శుభ సందర్భంగా తణుకు ఆర్టీసీ డిపో



కార్యాలయంలో బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పలు ఆర్టీసీ కార్మిక సంఘాలు మురళిని పూల బొకేతో అభినందించి సాలువతో సత్కరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ శుభ సందర్భంగా ఉద్యోగ నిర్వహణలో పలు తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వృత్తి పట్ల అంకితభావం నిబంధత కలిగిన వ్యక్తి అని ఆర్టీసీ బహుజన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిర్రా శ్యామ్సన్ కొనియాడారు. ఆర్టీసీ కార్మికుల పట్ల అంకిత భావం కలిగిన వ్యక్తి అని అన్నారు. పదోన్నతి పై వెళుతున్న మురళికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు, ఉద్యోగ పదోన్నతులు కల్పించాలని ఆ భగవంతున్ని కోరుకున్నారు. ఈ అభినందన కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు తణుకు డిపో మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌతాళం మండలంలో మహానేత వైఎస్సార్ 17వ వర్ధంతి.

**పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన దాట్ల కృష్ణంరాజు తనవుడు సుబ్బరాజు.**

కౌతాళం 02.09.2026 పతినిధి నరేష్...కౌతాళం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వారి వర్ధంతి సందర్భంగా కౌతాళం మండలంలో






వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల అర్పించారు దాట్ల సుబ్బరాజు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ.. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం జీవితాంతం పనిచేసిన మహానేత అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేశారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమం లో వైఎస్సార్ సీపీ నాయకులు గణపతి రాజు కుమార్ రాజు, డాక్టర్ అప్పులు ఎంపిటిసి రాజహమ్మద్, ,వీరేష్ ,సత్య గౌడ్, ఉపేంద్ర గౌడ్,రాము డ్రైవర్ లింగన్న మూలేమాన్ నరసింహులు, సాయిబాబా మోదిన్ సాబ్ దాట్ల యూత్ మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

## జనం గుండెల్లో వైఎస్సార్.. ఘనంగా వర్ధంతి




ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 2 దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట ప్రాంతాల్లో ఘనంగా నివాళులర్పించారు. గౌరవ ఎమ్మెల్సీ నర్తు రామారావు , జడ్పీ చైర్‌పర్సన్ పిరియ విజయ, నియోజకవర్గ సమన్వయకర్త శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, నర్తు నరేంద్ర ఆయా ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు



లర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలతో ప్రజల హృదయాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



కుప్పం,/ సెప్టెంబర్ 02 : విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధిని అలవర్చుకుని తమ జీవిత లక్ష్యాలను సాధించాలని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బి.సి. నాగరాజ్ సూచించారు. కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.సి. నాగరాజ్ మాట్లాడుతూ కుప్పం ఇంజనీరింగ్ కాలేజీలో విశ్వవిద్యాలయ స్థాయి విద్యకు అనుగుణంగా అత్యాధునిక సదుపాయాలు, నాణ్యమైన విద్యా వాతావరణం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలోని విద్యా, సాంకేతిక, మౌలిక వసతులను విద్యార్థులు సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. బీటెక్ విద్యాభ్యాసానికి కుప్పం ఇంజనీరింగ్ కాలేజీని ఎంచుకోవడం విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది అవుతుందన్నారు. జీవితంలో లక్ష్యాలను నిర్దేశించుకోవడంతో పాటు వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నిరంతర అభ్యాసం, నైపుణ్యాభివృద్ధి వంటి లక్షణాలను అలవరచుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సునీల్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఒక గొప్ప లక్ష్యాన్ని కలిగి ఉంటాడని, అయితే ఆ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతర పట్టుదలతో ముందుకు సాగే వారే చివరకు విజయాన్ని అందుకుంటారని పేర్కొన్నారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోధాలకు భయపడి వెనుకడుగు వేయడం విజయానికి ప్రధాన అడ్డంకిగా మారుతుందని అన్నారు. అవరోధాలను సమస్యలుగా కాకుండా అవకాశాలుగా భావించి, వాటిని అధిగమించేందుకు సరైన మార్గాలను అన్వేషించాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా విద్యార్థులు కుంగిపోకుండా, వెనుకడుగు వేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అవరోధాలపై ఆధిపత్యం సాధించాలనే సంకల్పం ఉన్న ప్రతి విద్యార్థికి విజయం తప్పక సొంతమవుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన మాతృభూమి మోటివేషన్ డైరెక్టర్, మోటివేషనల్ స్పీకర్ శ్రీనాగప్రసాద్ పాల్గొని విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి వంటి విభిన్న నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్పొరేట్ ప్రపంచంలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించాలంటే నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడం అత్యవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. భాస్కరన్, పరిశోధన--అభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ జి.ఎన్. కోదండరామయ్య, గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ సి.జి. శ్రవణ్, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి జె. మాధవన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కోసిగి, సెప్టెంబర్02 (: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కోసిగి మండలం అగసనూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు జనసైనికుల ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, కాపీ రైట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 250 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ప్యాడ్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గ్రామంలోని విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జనసైనికులు తెలిపారు. జనసైనికులు కోసిగి గురుస్వామి, ముల్లా రెహమాన్, ఇజ్రాయిల్ ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి అంజనారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, జనసైనికులు పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జనసైనికులను అభినందించారు.

## పల్లినగర్‌లో వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు



రిపోర్టర్ సురేష్ : సెప్టెంబర్ 2 : పెనుగొండ : హిందూపురం టౌన్ వర్షాకాలంలో సురప్పకుంట చెరువు నిండడంతో పల్లినగర్‌లోని పలు నివాస ప్రాంతాల్లోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టారు.ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు, సురేంద్ర సహకారంతో ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లను పిలిపించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీరు ఇళ్లలోకి రాకుండా శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపించాలని ఇంజనీర్లకు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ ఇంజనీర్ నాగార్జున పల్లినగర్‌లోని సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి, నీటి ప్రవాహం మరియు డ్రైనేజీ పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.అనంతరం 6వ క్లస్టర్ ఇంచార్జ్ పల్లినగర్ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, వర్షపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

## అంగరంగ వైభవంగా అశోక్ జన్మదిన వేడుకలు



పెనుగొండ : సెప్టెంబర్ 2 :హిందూపురం మండలం కొట్నూర్ గ్రామంలో రాము ధనుంజయ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ యువ నాయకుడు టి.అశోక్ జన్మదిన వేడుకలు కోట్నూర్ సర్కిల్ నందు అంగ రంగ వైభవంగా అశోక్ చేత కేక్ కటింగ్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కే. మూర్తి, నరేష్ 16,శివ ఆర్ఎంపి,పెట్రోల్ బాంక్ అది.మారుతీప్రసాద్ మరియు తన స్నేహితులతో కలిసి తన జన్మదిన వేడుకలు జరుపుకోవడం జరిగింది.

## ప్రజా హృదయాల్లో చిరస్థాయి.. వైఎస్సార్




కంచిలి, సెప్టెంబర్ 2 దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా కంచిలి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ



ఇన్‌చార్జ్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పైల దేవదాస్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, వివిధ అనుబంధ విభాగాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



అమరావతి రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారంపై చర్చించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అలాగే పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

## రైతుల సాహసం.. భారీ మొసలి బంధనం



కౌతాళం ప్రతినిధి సెప్టెంబర్ 2 మేళిగనూరు శ్రీ రామలింగేశ్వర దేవస్థానం సమీపంలోని నదిలో భారీ మొసలి కలకలం రేపింది. నదిలో సంచరిస్తున్న మొసలిని గుర్తించిన స్థానిక రైతులు ధైర్యసాహసాలు ప్రదర్శించి దానిని బంధించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం



అందించారు.మొసలిని రైతులు సాహసం చేసి బంధించిన విషయం. తెలుసుకున్న స్థానిక ప్రజలు వారిని అభినందించారు. తమ ప్రాణాలను సైతం. లెక్కచేయకుండా మొసలిని పట్టుకోవడంపై రైతుల ధైర్యసాహసాలను ప్రజలు మెచ్చుకున్నారు.అయితే నదీ పరివాహక ప్రాంతాల్లో మొసళ్ల సంచారం ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. మొసలిని సురక్షితంగా తరలించేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

## కేసరపాడలో పాస్‌బుక్‌ల పంపిణీ.. పాల్గొన్న టీడీపీ నాయకులు





కంచిలి, సెప్టెంబర్ 2: కంచిలి మండలం కేసరపాడ గ్రామంలో రైతులకు నూతన పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎం. రామారావు, మండల యువజన అధ్యక్షుడు మద్దిల ఆనందరావుతో పాటు జడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, మాజీ సర్పంచ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రైతులకు నూతన పాస్‌బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు!

### బ్రహ్మసముద్రం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పలకలు నోట్‌బుక్స్ పంపిణీ చేసిన మండల ఉపాధ్యక్షులు హెచ్. అనిల్ కుమార్!



బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 2 ప్రతినిధి రామాశీజి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మసముద్రం మండలంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా బ్రహ్మసముద్రం మండల ఉపాధ్యక్షులు హెచ్. అనిల్ కుమార్ ప్రత్యేక



చొరవ తీసుకున్నారు స్థానిక బ్రహ్మసముద్రం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన ఉచితంగా పలకలు, నోట్‌బుక్స్ రాసే పుస్తకాలు మరియు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. సమాజంలో మార్పు కోసం నిరంతరం శ్రమిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

## కౌతాళంలో జనసేన నాయకుడు రాంబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ 55 వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.



కౌతాళం 02.09.2026ప్రతినిధి నరేష్... ఈరోజు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు జనసేన పార్టీ అధ్యక్షులు అయిన శ్రీ కపవన్ కళ్యాణ్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.మొదటగా కౌతాళం గ్రామలో బైక్ ర్యాలీలో పాల్గొని... తదనంతరం జనసైనికులు మరియు అభిమానుల నడుమ కేక్ కట్ చేసి ఉపముఖ్యమంత్రి వర్యులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విషయం గురించి రాంబాబు మరియు అభిమానులు జనసైనికులు మాట్లాడుతూ శ్రీ పవన్ కళ్యాణ్ పంచాయత్ శాఖ సంబంధించి 24 స్థానంలో ఉన్న పంచాయతీ శాఖను ఈరోజు నంబర్ వన్ స్థానానికి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని గర్వంగా చెప్తున్నాం అదేవిధంగా కౌతాళం మండల కేంద్రమైన కౌతాళంలో శిథిలావస్థలో ఉన్న ట్యాంకు 25 లక్షలు మంజూరు చేసిన ఘనత పవన్ కళ్యాణ్ గారికి దక్కుతుంది ఇలాంటి నాయకుడు ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో రాంబాబు సాయిబన్న అబ్దుల్ దేవదాసు దాసన్న అంజి లక్ష్మన్న చూడి భీమేష్ ఎరిగేరి మల్లికార్జున మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు

## మల్లంపల్లి నుంచి జిల్లా కేంద్రానికి బీఆర్ఎస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ



మల్లంపల్లి సెప్టెంబర్ 2 కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మల్లంపల్లి నుంచి జిల్లా కేంద్రానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.మల్లంపల్లి మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బైక్‌లపై తరలివచ్చారు. బీఆర్ఎస్ జెండాలు చేతబూని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మల్లంపల్లి నుంచి జిల్లా కేంద్రం వరకు ర్యాలీగా తరలివెళ్లారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కాలం గడుస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ ర్యాలీ నిర్వహించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. రైతులకు సంబంధించిన సమస్యలు, రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఇచ్చిన హామీలు తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే ఈ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, హామీల అమలు జరిగే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లంపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు, చుట్టుపక్కల గ్రామాల పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## 13 గుంటల భూమి మింగేస్తున్నారా?

**తాటి నగర్‌లో ఆరేళ్లుగా రైతు పోరాటం.. కబ్జా వెనుక ఎవరి అండ?**

**రాజకీయ పలుకుబడి ఉందా?**

**రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి సర్వేపై అనుమానాలు -- సమగ్ర విచారణకు డిమాండ్**




కౌటాల, సెప్టెంబర్ 2: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తాటి నగర్ గ్రామంలో 13 గుంటల భూమికి సంబంధించిన వివాదం ఆరేళ్లుగా కొనసాగుతున్నా పరిష్కారం కాకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 75/పి. పి పరిధిలోని భూమిపై తన హక్కులను కాపాడుకోవడానికి బాధిత రైతు సంవత్సరాలుగా కౌటాల మండలం లోని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమికి సంబంధించిన పాత రికార్డుల వివరలు మరియు సరిహద్దులు, సర్వే పత్రాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు తుది పరిష్కారం లభించలేదని రైతు పేర్కొంటున్నారు.ఆరేళ్లుగా ఒక రైతు తన భూమి హక్కుల కోసం పోరాడుతుంటే అధికార యంత్రాంగం ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. అసలు భూమిపై వాస్తవ హక్కుదారు ఎవరు? రెవెన్యూ రికార్డుల్లో ఏముంది? క్షేత్రస్థాయిలో భూమి పరిస్థితి ఎలా ఉంది? పాత రికార్డులు, ప్రస్తుత రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసాలున్నాయా? అనే అంశాలను అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.ఇదే సమయంలో "ఈ భూమి వివాదం వెనుక ఎవరైనా రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయా?" అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ అంశంపై ఎలాంటి వ్యక్తి లేదా రాజకీయ నాయకుడి ప్రమేయం ఉన్నట్లు అధికారికంగా నిర్ధారణ కాలేదు. కాబట్టి ఈ అనుమానాలకు తెరదించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. భూమి వివాదంలో రాజకీయ జోక్యం, స్థానిక పలుకుబడి లేదా ఇతర ఒత్తిళ్లు ఉన్నాయా అనే కోణంలోనూ అవసరమైతే విచారణ చేపట్టాలని బాధిత రైతు కోరుతున్నారు.భూమి విషయంలో నిజానిజాలు బయటకు రావాలంటే కేవలం కార్యాలయాల్లో ఫైళ్ల పరిశీలనతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, సరిహద్దులను నిర్ధారించి, సంబంధిత రికార్డులను బహిరంగంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని బాధితుడు చెబుతున్నారు. అధికారిక సర్వే నివేదిక ఆధారంగా భూమి హక్కులను తేల్చి, అక్రమంగా ఎవరి ఆధీనంలోనైనా భూమి ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు."ఆరేళ్లుగా నా భూమి హక్కుల కోసం తిరుగుతున్నాను. నా దగ్గర ఉన్న పత్రాలను పరిశీలించి, అధికారికంగా సర్వే చేసి నిజం తేల్చాలి. న్యాయం కోసం ఇంకెంతకాలం కార్యాలయాల చుట్టూ తిరగాలి?" అని బాధిత రైతు ప్రశ్నిస్తున్నారు.జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత రెవెన్యూ అధికారులతో సమగ్ర విచారణ చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. భూమి రికార్డులు, పాత పట్టా వివరాలు, సర్వే రికార్డులు, క్షేత్రస్థాయి హద్దులు, సంబంధిత దరఖాస్తులు, గతంలో జరిగిన విచారణల వివరాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.13 గుంటల భూమి వివాదం ఆరేళ్లుగా ఎందుకు సాగుతోంది? బాధిత రైతుకు న్యాయం ఎందుకు ఆలస్యమవుతోంది? ఈ వ్యవహారంలో ఎవరి ఒత్తిళ్లు పనిచేస్తున్నాయి? రాజకీయ అండదండలు ఉన్నాయన్న అనుమానాలకు అధికారులు సమాధానం చెబుతారా? అనే ప్రశ్నలకు సమగ్ర విచారణే సమాధానం చెప్పాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారదర్శకంగా సర్వే నిర్వహించి, రికార్డుల ఆధారంగా హక్కులను నిర్ధారించి వివాదానికి శాశ్వత ముగింపు పలకాలని బాధిత రైతు కోరుతున్నారు.

## సత్తుపల్లిలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు బైక్ ర్యాలీతో సందడి చేసిన జనసేన శ్రేణులు



సత్తుపల్లి ఆర్ సి/ సెప్టెంబర్ 2జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తుపల్లి పట్టణంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సత్తుపల్లి బస్టాండ్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై పాత బస్టాండ్ మీదుగా తిరిగి సత్తుపల్లి బస్టాండ్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొని పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం సుభాష్ చంద్రబోస్ విగ్రహం, రింగ్ సెంటర్ వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి జన్మదిన వేడుకలను ఘనంగా



జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు ఆళ్ళ నరేష్, మండల అధ్యక్షుడు సింగపోగు అప్పారావు, మున్సిపల్ కౌన్సిలర్ తోట సుజలా రాణి, బత్తుల పవన్, డాక్టర్ రామ్ హరీష్ కొండూరి, మిట్టపల్లి సత్యనారాయణ, మహమ్మద్ సైఫ్, సంపటం వంశీకృష్ణ, నవీన్, పవన్, గణేష్, ఆఫ్రిది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సేవ, సామాజిక బాధ్యత, ప్రజల సంక్షేమం కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. జనసేన కార్యకర్తలు భవిష్యత్తులోనూ ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసిన జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## : వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం..

### ఎమ్మెల్యే మట్టా రాగమయి...



సత్తుపల్లి ఆర్ సి/ సెప్టెంబర్ 2(:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సత్తుపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగానివాళులర్పించారు. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారిపై ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. ముఖ్యంగా రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సాగించిన పాలన నేటికీ ప్రజల మనసుల్లోనిలిచిపోయిందని పేర్కొన్నారు.ప్రజల కోసం నిరంతరం శ్రమించిన వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఆయన చూపిన సంక్షేమం, అభివృద్ధి బాటలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, కమల్ పాషా, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సందీప్ గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ఎన్ఎస్‌యూఐ



నాయకులు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయనను స్మరించుకుంటూ నినాదాలు చేశారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలను ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

### వైద్య పరికరాల పరిశీలించిన.. ఎమ్మెల్యే మట్టా రాగమయి...



సత్తుపల్లి ఆర్సి/ సెప్టెంబర్ 2(:సత్తుపల్లి పట్టణంలోని నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. బుధవారం సత్తుపల్లి ఆసుపత్రి అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె పరిశీలించారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ నాయక్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలనుపరిశీలించారు. గతంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రికి అందించిన వైద్య పరీక్షల పరికరాలను పరిశీలించి వాటి



వినియోగం, పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారమని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి వైద్య ఆరోగ్య శాఖ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఆసుపత్రిలో అవసరమైన మరిన్ని సౌకర్యాలు, వైద్య పరికరాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తాననితెలిపారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎమ్మెల్యే స్వయంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు, మందుల లభ్యత, ఆసుపత్రిలో అందుతున్న సౌకర్యాలపై రోగులతో మాట్లాడి వివరాలుతెలుసుకున్నారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ అవసరమైన సమయంలో తగిన వైద్య సహాయం అందించాలని వైద్యులకు సూచించారు.అదేవిధంగా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న ఆహారాన్ని కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. రోగులకు పుష్టికరమైన, నాణ్యమైన పోషకాహారం అందించాలని, ఆహారం నాణ్యతతో పాటు పరిమాణాన్ని కూడా పెంచాలని కాంట్రాక్టర్, సంబంధిత సిబ్బందికి సూచించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆహార విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన అదనపు సౌకర్యాలు, వైద్య పరికరాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు, సౌకర్యాలు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీఇచ్చారు.కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేష్ నాయక్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ వేళ సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు రూ.2.01 కోట్ల రాబడి

**గతేడాదితో పోలిస్తే రూ.10 లక్షల అదనపు ఆదాయం.. డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ**



సత్తుపల్లి ఆర్సి/ సెప్టెంబర్ 2రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు భారీగా ఆదాయం సమకూరింది. ఆగస్టు 26 నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల వ్యవధిలో రూ.2,01,30,786 ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు.రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా షెడ్యూల్ బస్సులతో పాటు అదనపు బస్సులను నడిపి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చినట్లు ఆయన తెలిపారు. ఈ ఆరు రోజుల్లో బస్సులు మొత్తం 3,08,183 కిలోమీటర్లు ప్రయాణించగా, 100 శాతం ఓఆర్, రూ.65.32 ఈపీకే నమోదైనట్లు వివరించారు.ప్రతిరోజూ ప్రయాణికుల రద్దీని అంచనా వేసి అదనపు బస్సులు నడపడం ద్వారా అధిక ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. రీజినల్ మేనేజర్ ఏ. శ్రీరామ్ సూచనల మేరకు సాధారణ సర్వీసులకు అదనంగా 543 బస్సులు నడిపినట్లు తెలిపారు.గత ఏడాది రాఖీ పండుగ ఆదాయంతో పోలిస్తే ఈ ఏడాది అదనంగా రూ.10 లక్షల ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ తెలిపారు. అదనపు బస్సులు, కిలోమీటర్లు నడపడంలో సహకరించిన సత్తుపల్లి డిపో సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణతో పాటు అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సాహితి పాల్గొన్నారు.

## పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి

**మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం**




సత్తుపల్లి ఆర్సి / సెప్టెంబర్ నిత్యావసర సరుకుల ధరలను అధికంగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మోయలేని భారాలను మోపుతోందని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు గంట శ్రీనివాసరావు, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి శరత్ విమర్శించారు. పెంచిన నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సత్తుపల్లి మసీదు రోడ్డులో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే పెట్రోల్, డీజిల్, మందులు, వైద్య ఖర్చులు, విద్యుత్ చార్జీలు, దుస్తులు తదితరాల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గోరుచుట్టుపై రోకలి పోటులా నిత్యావసర సరుకుల ధరలను కూడా పెంచడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీసే విధంగా ధరల పెరుగుదల కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా, మరోవైపు ప్రజలపై భారాలు మోపడం అవకాశవాద రాజకీయాలకు, ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని అన్నారు.కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తూ సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు గణనీయంగా పెరిగాయని, ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.పెంచిన నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజలపై భారాలను మోపే విధానాలకు వ్యతిరేకంగా మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కందిమల్ల నాగప్రసాద్, ఎస్కే ఆదం, విశ్వనాథం కృష్ణారావు, సీతా కవిత, అలివేలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.